



# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక






సంపుటి: 4 సంచిక: 68, పేజీలు - 08

శనివారం, జులై 6, 2024 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాం ఆదుకోండి

**- నిర్మలా సీతారామన్‌తో సీఎం చంద్రబాబు భేటీ**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన సాగింది. రెండో రోజు పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం ఉదయం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాన్ని ఆదుకోవాలని తగిన చేయూత ఇవ్వాలని కోరారు. పోలవరం ప్రాజెక్ట్, అమరావతి నిర్మాణాలకు నిధులు, అప్పులకు అనుమతుల సడలింపు వంటి అంశాలపై చర్చించారు. రాజధాని అమరావతి ప్రాంతంలో మౌలిక సదుపాయాలను కల్పించడానికి అవసరమైన నిధులను సత్వరమే విడుదల చేయాలని కోరారు. అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాల నిర్మాణాన్ని 6లో ▶

## గ్రేటర్‌లో బీఆర్ఎస్ సమావేశానికి ఎమ్మెల్యేల డుమ్మా

6లో ▶

# కేసీఆర్‌కు కలిసిరాని సెంటిమెంట్

**- వెక్కిరిస్తున్న లక్కీ నంబర్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు సెంటిమెంట్లు ఎక్కువ. ఆయన ఏ పని చేసిన ముహూర్తం చూసుకుని చేస్తారు. ఇక తన లక్కీ నంబర్ కలిసి వచ్చేలా చూసుకుంటున్నారు. తన జాతకానికి అనుకూలంగా ఉంటేనే ఆ పని చేస్తారు. లేదంటే చేయరు. తన జాతయానికి కలిసి వచ్చేలా హరితహారంలో కదంబ వృక్షం నాటారు. తన లక్కీ నంబర్ 6 కలిసి వచ్చేలా తెలంగాణలో జిల్లాల పునర్విభజన చేశారు. తన లక్కీ నంబర్ ప్రకారమే అసెంబ్లీ సీట్లు ప్రకటించారు. ఇక ఎన్నికల వేళలో యాగాలు, పూజలు చేయడం ఆయనకు అలవాటే. అయితే ఇప్పుడు కేసీఆర్ నమ్ముకున్న సెంటిమెంటే ఆయనకు శనిలా మారింది. లక్కీ నంబరే గులాబీ బాస్‌ను వెక్కిరిస్తోంది.

### అచ్చిరాని ఆరు నంబర్..

ప్రస్తుతం తెలంగాణలో అధికార కాంగ్రెస్ మొదలు పెట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆకర్షితులవుతున్నారు. ప్రత్యర్థి వ్యూహమో, యాదృచ్ఛికమో తెలియదు కానీ కేసీఆర్ బలంగా విశ్వసించే లక్కీనంబర్ ప్రకారమే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీ మారుతున్నారు. దీంతో ఆయన నమ్ముకున్న లక్కీ నంబరే ఇప్పుడు కేసీఆర్‌ను కలవరపెడుతోంది. కేసీఆర్ లక్కీ నంబరే బీఆర్ఎస్‌ను బలహీన పరుస్తోంది.

### ఆరు గ్యారంటీలు..

కేసీఆర్ నమ్ముకున్న ఆరు సంఖ్య 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కలిసి వచ్చింది. ఆరు గ్యారంటీల హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లిన కాంగ్రెస్ ఎన్నికల్లో విజయం సాధించింది. ఇక ఇప్పుడు అదే ఆరు నంబర్ ప్రకారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీని వీడుతున్నారు. ఇప్పటి వరకు తెలంగాణలో బీఆర్ఎస్‌కు చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లాం వెంకట్రావు, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సంజయ్‌కుమార్, కాలె యాదయ్య అధికార పార్టీలో చేరారు. ఇక గురువారం అర్ధరాత్రి (జూన్ 4న) ఆరుగురు ఎమ్మెల్సీలు దండె విఠల్, భానుప్రసాద్‌రావు, ఎంఎస్.ప్రభాకర్, బొగ్గారపు దయానంద్, ఎగ్గే మల్లేశం, బస్వరాజు సారయ్య హస్తం తీర్థం పుచ్చుకున్నారు. సీఎం 6లో ▶

## నీట్ రద్దు చేయడం హేతుబద్ధం కాదు

**- సుప్రీంకోర్టుకు తేల్చిచెప్పిన కేంద్రం**




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన నీట్ యూజీ 2024 పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అయితే నీట్ పరీక్షను రద్దు చేయలేమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ వ్యవహారానికి సంబంధించి.. సుప్రీంకోర్టులో తాజాగా కేంద్రం అఫిడవిట్ దాఖలు చేసింది. నీట్ పరీక్షలో భారీగా అక్రమాలు జరిగినట్లు ఆధారాలు లేవని.. అందుకే ఈ పరీక్షను మళ్లీ నిర్వహించాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పింది. ఇప్పుడు నీట్ పరీక్షను రద్దు చేస్తే లక్షలాది మంది విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపింది. నీట్ అవకతవకలపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు తెలిపిన కేంద్రం.. ప్రశ్నాపత్రం లీకేజీ నిందితుల్ని ఇప్పటికే అరెస్ట్ చేసినట్లు వెల్లడించింది. నీట్ పరీక్షను రద్దు చేయడం అంటే కష్టపడి చదివి.. నిజాయతీగా పరీక్ష రాసిన విద్యార్థుల ప్రయోజనాలను దెబ్బతీసినట్లే అవుతుందని స్పష్టం చేసింది. ఎలాంటి పోటీ పరీక్షలనైనా.. పారదర్శకంగా నిర్వహించేందు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు తేల్చి చెప్పింది. ఇక నీట్ అక్రమాలపై విచారణ చేసేందుకు సీబీఐ విచారణకు ఆదేశించినట్లు తెలిపిన కేంద్రం.. నీట్ పేపర్ లీకేజీ కేసులో ఇప్పటికే పలువురు నిందితులను 6లో ▶

# విభజన సమస్యలే అజెండాగా భేటీ

**- ఇద్దరూ ఒప్పుకుంటే మోడీ సై**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలుగు రాష్ట్రాల విభజన జరిగి పదేళ్లు దాటిపోతున్నా ఇంకా ఉమ్మడి సంస్థల విభజన సహా పలు పెండింగ్ సమస్యలు వెంటాడుతున్న నేపథ్యంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి నేడు హైదరాబాద్ లో భేటీ కానున్నారు. నగరంలోని ప్రజా భవన్ లో సాయంత్రం 6 గంటలకు ఈ భేటీ జరగనుంది. ఇందులో ఇద్దరు ముఖ్యమంత్రులు పలు కీలక అంశాలపై చర్చించి ఓ పరిష్కారం కనుగొంటారని తెలుస్తోంది. చంద్రబాబు-రేవంత్ రెడ్డి భేటీలో ప్రధానంగా షెడ్యూల్ 9, 10లోని సంస్థల విభజనపై చర్చించబోతున్నారు. ఉమ్మడి ఏపీ విభజనకు సంబంధించి అపరిష్కృత అంశాలపై ముఖ్యమంత్రులు భేటీ కావడం ఇదే తొలిసారి కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇరువురి నేతల మధ్య ప్రధానంగా షెడ్యూల్ 9, షెడ్యూల్ 10లో ఉన్న సంస్థల విభజన, చట్టంలో పేర్కొనని సంస్థల ఆస్తుల విభజన సహా, ఇతర అంశాలు సైతం చర్చకు వచ్చే అవకాశం ఉంది. విద్యుత్ బకాయిలు, స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్, ఉద్యోగుల మార్పిడి, లేబర్ సెస్ విభజన, సాధారణ సంస్థలపై ఖర్చుల రీయింబర్స్‌మెంట్, హైదరాబాద్‌లో మూడు భవనాలు ఏపీ కోసం కొనసాగించడం అంశాలపై చర్చించనున్నారు.

### వీటిపైనే ఫోకస్

ఇరు రాష్ట్రాల మధ్య ప్రధానంగా విద్యుత్ సంస్థలకు సంబంధించి బకాయిలపైనే సమస్య అపరిష్కృతంగా ఉంది. ఏపీ ప్రభుత్వం దాదాపు రూ.24 వేల కోట్లు చెల్లించాల్సి ఉందని తెలంగాణ ప్రభుత్వం చెబుతుండగా.. తెలంగాణనే తమకు రూ.7 వేల కోట్లు చెల్లించాల్సి ఉందని ఏపీ వాదిస్తోంది. కాగా, ఇరు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు కొలువుదీరిన క్రమంలో విభజన అంశాలు సహా ఇతర 6లో ▶

## హైదరాబాద్‌లో చంద్రబాబుకు ఘనస్వాగతం

**- జోరు వానలోనూ చంద్రబాబు ర్యాలీ**

**- నగరంలో పలుచోట్ల స్వాగత ఫ్లెక్సీల ఏర్పాటు**

6లో ▶



## జాబ్ కాలెండర్ ప్రకారమే ఉద్యోగాల భర్తీ

**- నిరుద్యోగ యువత నిరసనలపై స్పందించిన ముఖ్యమంత్రి**

**- పార్టీకి చెందిన విద్యార్థి, యువత, నేతలు, అధికారులతో చర్చలు**

**- ఉద్యోగ భర్తీకి కృతనిశ్చయంతో ఉన్నట్లు వెల్లడి**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ఉద్యోగాల భర్తీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, తప్పకుండా నిరుద్యోగులకు మేలు జరిగే నిర్ణయాలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కొన్ని రాజకీయ పార్టీలు, స్వార్థపూరిత శక్తుల కుట్రలకు నిరుద్యోగులు బలికావద్దని ఆయన సూచించారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో ఇష్టమొచ్చినట్లు నిబంధనలు మార్చితే తలెత్తే చట్ట పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసినట్లు తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే నిరుద్యోగులకు న్యాయం జరగకడానికి బదులు 6లో ▶



## ఆ పెద్ద తలకాయలను పట్టుకోండి

**- ఎర్ర చందనం అక్రమ రవాణా కట్టడిపై పవన్ ఫోకస్**

**- అటవీశాఖ అధికారులతో సమీక్షా సమావేశం**

**- కింగ్ పిన్‌లను పట్టుకోవాలంటూ ఆదేశం**

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దూకుడు పెంచారు. ఎర్రచందనం స్మగ్లర్ల ఆట కట్టించే విధంగా అడుగులు వేస్తున్నారు. అటవీశాఖ మంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ ఇప్పటికే ఓసారి అటవీశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎర్రచందనం స్మగ్లర్లను నియంత్రించాలని అధికారులను ఆదేశించిన పవన్ నేపాల్‌కు తరలిపోయిన ఎర్రచందనాన్ని వెనక్కి తీసుకురావాలని అప్పట్లో ఆదేశించారు. తాజాగా శుక్రవారం మరోసారి పవన్ కళ్యాణ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో 6లో ▶



## తెలంగాణకు కొత్త ఎన్నికల కమిషనర్

**- వికాస్ రాజ్ బదిలీ, సుదర్శన్ రెడ్డి నియామకం**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ బదిలీ అయ్యారు. తెలంగాణ నూతన ఎన్నికల ప్రధానాధికారికిగా సుదర్శన్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్





## బ్రిటన్ కొత్త ప్రధాని కైర్ స్టార్మర్

**- 14 ఏళ్ల తర్వాత మళ్లీ అధికారంలోకి లేబర్ పార్టీ**

**- ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న కైర్ స్టార్మర్**

**- భారత్‌తో సత్సంబంధాలు కోరుకుంటున్నట్లు సంకేతాలు**

**- బ్రిటన్ ఎన్నికలపై ప్రధాని మోదీ స్పందన**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) యూకే ఎన్నికల్లో విజయం సాధించిన లేబర్ పార్టీ 14 ఏళ్ల తర్వాత తిరిగి అధికారం చేపట్టనుంది. బ్రిటన్ తదుపరి ప్రధానిగా ఆ పార్టీకి చెందిన 61 ఏళ్ల కైర్ స్టార్మర్ బాధ్యతలు స్వీకరించనున్నారు. వృత్తిరీత్యా లాయర్ అయిన స్టార్మర్ న్యాయశాస్త్రంలో చేసిన సేవలకుగానూ బ్రిటన్ 6లో ▶

## కేసీఆర్‌కు, బీఆర్ఎస్‌కు సీతక్క లీగల్ నోటీసులు

**- తన ప్రతిష్టకు భంగం కలిగేలా వీడియోలు పెట్టారని ఆవేదన**

6లో ▶



## టీజీపీఎస్సీ ముట్టడి.. ఉద్రిక్తంగా హైదరాబాద్

**- అడుగడుగునా తనిఖీలు, అరెస్టులు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులు పోరుబాట పట్టారు. గ్రూప్ పోస్టుల పెంపుదల, గ్రూప్ వన్ మెయిన్స్ కు 1:100 నిష్పత్తి, జాబ్ క్యాలెండర్ విడుదల కోసం నిరుద్యోగులు ఆందోళన బాట పట్టారు. ఇందులో భాగంగా హైదరాబాద్ లోని టీజీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించాలని జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు టీజీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించే యత్నం చేశారు. అయితే అప్పటికే భారీగా మోహరించిన పోలీసులు నగరంలో ఎకడికక్కడ ఆందోళనల కోసం వచ్చిన నిరుద్యోగులను అరెస్ట్ చేశారు. నిరద్యోగుల ఆందోళన అణచివేతకు పాల్పడ్డారు. బీజేవైఎం, బీఆర్ఎస్వి ఆధ్వర్యంలో నిరుద్యోగ జేఏసీ హైదరాబాద్లోని టీజీపీఎస్సీ కార్యాలయం ముట్టడికి ప్రయత్నించిన క్రమంలో హైదరాబాద్ వ్యాప్తంగా ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. హైదరాబాద్ నగర శివారులో ఉన్న బస్టాండ్ లు, 6లో ▶

# గ్రేటర్‌లో బీఆర్ఎస్ సమావేశానికి ఎమ్మెల్యేల డుమ్మా

## - భాగ్యనగరంలో బీఆర్ఎస్‌కు షాక్ తప్పదా.?




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గ్రేటర్ హైదరాబాద్ లో బీఆర్ఎస్ పరిస్థితి గందరగోళంగా మారింది. తెలంగాణ భవన్ లో ఆ పార్టీ నిర్వహించిన కీలక సమావేశానికి ఐదుగురు ఎమ్మెల్యేలు గైర్హాజర్ అయ్యారు. గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమెపై అవిశ్వాసం పెట్టాలన్న యోచనలో బీఆర్ఎస్ ఉంది. అందుకే కార్పొరేటర్లు ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి రావాలని గ్రేటర్ పరిధిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరికీ సమాచారం పంపారు.అయితే ఐదుగురు ఎమ్మెల్యేలు హాజరు కాలేదు.

### సమావేశానికి హాజరు కాని ఐదుగురు ఎమ్మెల్యేలు

శేరిలింగం పల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద హాజరు కాలేదు. కాలేరు వెంకటేష్, పద్మారావు, ప్రకాష్ గౌడ్ మాత్రమే హాజరయ్యారు. మామూలుగా అయితే ఈ సమాశం కేటీఆర్ ఆధ్వర్యంలో జరుగుతోందని పిలిచారు. కానీ కేటీఆర్ ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నారు. సమావేశానికి హాజరు కాలేదు. తలసాని నేతృత్వంలో నిర్వహించారు. ఈ కారణంగా హాజరు కాలేదా లేకపోతే కాంగ్రెస్ పార్టీతో టచ్ లోకి వెళ్లారా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. సమావేశానికి హాజరు కావాలని ఫోన్లు చేసినా ఈ ఎమ్మెల్యేలు స్పందించలేదని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి.

### ఢిల్లీలో కేటీఆర్ - సమావేశానికి తలసాని నేతృత్వం

అలాగే పదిమంది కార్పొరేటర్లు కూడా హాజరు కాలేదు. మేయర్ గద్వాల విజయలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెట్టే ప్రయత్నాలు ఈ సమావేశానికి గైర్హాజర్ అయిన నేతల వల్ల సాధ్యమయ్యే అవకాశం లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. మెజార్టీ గ్రేటర్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ తో టచ్ లోకి వెళ్లారని వారి అనుచరులైన కార్పొరేటర్లు కూడా అదే దారిలో ఉన్నారని అంటున్నారు. ఒక వేళ అవిశ్వాసం పెట్టినా మజ్లిస్ సహకరిస్తే తప్ప ముందుకు సాగలేరు. మజ్లిస్ ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా వెళ్లే అవకాశం లేదని తెలుస్తోంది.

### గ్రేటర్ పరిధిలో భారీ విజయాలు సాధించిన్ బీఆర్ఎస్

గ్రేటర్ పరిధిలో గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయాలు సాధించింది. కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు కూడా రాలేదు. అయితే రాష్ట్రంలో అధికారం పోవడంతో ఎక్కువ మంది ఎమ్మెల్యేలు అభివృద్ధి కోసం పార్టీ మారాలన్న ఆలోచనలో ఉన్నారు. వారితో కాంగ్రెస్ సంప్రదింపులు జరిపిందని చెబుతున్నారు. ఇలాంటి కీలక సమయంలో సమావేశాలకు డుమ్మా కొట్టడంతో పార్టీ మార్పు ప్రచారాలకూ మరింత ఊపు వస్తున్నట్లవుతోంది.

# మల్లాపూర్‌లో అక్రమ నిర్మాణాల జోరు

## ఏసీపి ఆదేశాలను లెక్కచేయని చైన్ మెన్‌లు

**- నోటీసులకే పరిమితమైన అధికారులు లంచాలే కారణమా.?**

**- ప్రజా ప్రతినిధుల అండతో లెక్కచేయని అక్రమ నిర్మాణదారులు**













నాచారం (ప్రశ్న న్యూస్) కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు పూర్తి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మల్లాపూర్ డివిజన్లో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలు దర్శనమిస్తున్నాయి. అటు అధికారులకు, ఇటు ప్రజాప్రతినిధులకు కావాల్సింది ఇవ్వడంతో అక్రమ నిర్మాణాలపై కన్నెత్తి చూడకుండా అందిన కాడికి దోచుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మల్లపూర్ చౌరస్తా నుండి మణిక్చంద్ వెళ్లే రహదారిలో నిర్మాణాలకు రెండంతస్తుల అనుమతి తీసుకొని ఏకంగా 5 అంతస్తుల అక్రమ నిర్మాణం చేస్తుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం ఒక్క నోటీసు జారీ చేసి మామూళ్లు వసూలు చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదే అదనుగా అక్రమ నిర్మాణదారులు స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో అధికారుల ఆదేశాలను లెక్కచేయకుండా అధికారులకే సవాల్ విసురుతున్నారా.? దమ్ముంటే కూల్చి వేయండి అన్నట్లుగా మారింది కాప్రా సర్కిల్ పరిధిలోని టౌన్ ప్లానింగ్ అధికారుల వ్యవహారం. దానితో నిర్మాణదారుడు విసురుతున్న సవాల్ కు టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది తలదించుకుంటున్నారు. ఎందుకంటే ముందుగానే ఈ అక్రమ నిర్మాణదారుని దగ్గర నుండి లక్షలలో లంచాలు తీసుకున్నారన్న అందుకోసమే ఎన్ని ఫిర్యాదులు చేసిన అధికారులు స్పందించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకోసమే ఏసీపీ గిరిరాజ్ కూల్చివేతను సైతం తూతూ మంత్రంగా చేస్తున్నారని వాస్తవానికి కూల్చివేతలు చేయాలంటే గ్యాస్ కట్టర్లు, డ్రిల్లింగ్ మిషన్లతో పిల్లర్లను, ఎలివేషన్ కూల్చివేయాలి గ్యాస్ కట్టర్ తో కట్ చేయాలి కానీ ఇక్కడ అధికారులు సిబ్బంది లాలూచీ తో ఆలాంటి కూల్చివేతలు చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దానికి తోడు ఏసిపి గిరి రాజ్ జిహెచ్ఎంసి నిబంధనల తుంగలో తొక్కి కూల్చివేత్తలు చేయడం లేదని చైన్ మెన్లు ఏసీపీకి సహకరిస్తాలేరన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే చైన్ మెన్ లు అక్రమ నిర్మాణదారులతో ముందుగానే చేతులు కలిపి కావలసిన లంచాలు తీసుకొని పూర్తిస్థాయిలో కూల్చివేతలు చేయకుండా అక్రమ నిర్మాణదారులకు పూర్తిగా సహకరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. జిహెచ్ఎంసి నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనాలను టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేయవచ్చు, తిరిగి నిర్మాణ భవనమును కూల్చవచ్చు కానీ అలా చేయడం లేదు. ఎందుకంటే అధికారులు అక్రమ నిర్మాణాలకు లంచాలు తీసుకొని పూర్తిగా సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి ఏది ఏమైనా కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ పరిధిలో ఏసీపీ, సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతోంది. అక్రమ నిర్మాణాలకు వాళ్లు పూర్తి సహకారం అందించడం వల్లనే ఇంత భారీ స్థాయిలో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్, జిహెచ్ఎంసి కమిషనర్ స్పందించి ఈ అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

# జగన్‌కు నితీష్ అస్త్రం

**ఒంగోలు :** వైఎస్ జగన్ కి అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత పరిస్థితులు తలకిందులయ్యాయి. 151 సీట్ల నుంచి ఒక్కసారిగా 11 సీట్లకు పడిపోవడంతోపాటు వైసీపీ అధినేత జగన్ తీవ్ర నిరాశలో మునిగిపోయారు. అసెంబ్లీలో కేవలం 11 సీట్లే రావడంతో ప్రతిపక్ష హోదా కల్పించమని అర్థించవలసి వచ్చింది. అది కూడా తనను ద్వేషిస్తున్నాడు, తన చావునే కోరుకున్నాడని చెప్పుకునే అయ్యన్నపాత్రుడుకి లేఖ రాయడం జగన్‌కు ఇబ్బందికరంగా మారింది. అయినా ప్రతిపక్ష హోదా వస్తుందన్న నమ్మకం లేదు. మొన్నటిదాకా సిద్ధం సభల్లో నేను అభిమన్యుణ్ని కాదు అర్జునుడిని అని జగన్ చెప్పుకున్నప్పటికీ ఎన్నికల్లో ఘన విజయం తర్వాత చంద్రబాబు తన వ్యూహాలతో జగన్‌ని పద్మవ్యూహంలోకి నెట్టేశారన్న సైటైర్లు వినిపిస్తున్నారు. ఆ విధంగా నువ్వు అర్జునుడివి కాదు.. అభిమన్యుడివే అని చంద్రబాబు చెప్పకనే చెప్పారు. టీడీపీకి 16 మంది ఎంపీలుంటే, నాక్కూడా రాజ్యసభ 11, లోక్‌సభలో 4 కలిపి 15 మంది ఎంపీలున్నారని జగన్ పైకి చెప్పుకుంటున్నప్పటికీ బీజేపీ నుంచి ఆశించిన మద్ధతు మాత్రం లభించడం లేదు. ఎన్డీఏలో టీడీపీ భాగస్వామిగా ఉన్నా, జగన్ మాత్రం స్పీకర్ ఎన్నికల్లో బీజేపీకే తన మద్ధతు ప్రకటించారు. ఇన్ని చేసినా జగన్ కోరుకున్న జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత కేంద్రం కల్పించలేదు.బీహార్ సీఎం నితీశ్ కుమార్ రూపంలో ఆయనకు ఒకదారి దొరికింది. బీహార్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని నితీశ్ డిమాండ్ చేయడంతో జగన్‌కి వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్టయింది. టీడీపీని ఎదుర్కోవడానికి సరైన సమయంలో సరైన అస్త్రం దొరికినట్టయింది వైసీపీకి. ఏపీకి సంబంధించి పోలవరం, ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్ ప్లాంట్ వంటి అంశాల్లో ఎలాంటి ప్రకటన చేయకపోయినా బీజేపీతో జట్టు కట్టిన చంద్రబాబు, భారీ విజయం తర్వాత కన్వినియంట్‌గా డిమాండ్‌లు పక్కనపెట్టేసి అమరావతి మీద పూర్తిగా ఫోకస్ చేస్తాడని అందరూ అనుకున్నారు. కానీ నితీశ్ కుమార్ బీహార్ కు ప్రత్యేక హోదా డిమాండ్ చేయడంతో బాబు కూడా ఇరుకునపడినట్టయింది.తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాన్ బెనర్జీ వాషింగ్ పౌడర్ నిర్మా స్కీమ్‌లో భాగంగా ఎన్డీఏలో చేర్చుకుని చంద్రబాబుపై కేసులని మాఫీ చేశారని బీజేపీపై చేసిన ఆరోపణలు సభలో ఉన్న టీడీపీ ఎంపీలను ఇరకాటంలో పడేశాయి. ఎన్డీఏలో భాగస్వామిగా ఉండి కూడా ప్రత్యేక హోదా అడగడం లేదని రాబోయే రోజుల్లో రాష్ట్రంలో చంద్రబాబును దోషిగా నిలబెట్టేందుకు జగన్ వ్యూహ రచన చేసే అవకాశం లేకపోలేదు. నితీశ్ చేసిన పని బాబుని ఇరకాటంలోకి నెట్టేసింది. ప్రస్తుతం ఉన్న ఆర్థిక సంక్షోభంతో పాటు తనపై ఉన్న కేసుల నేపథ్యంలో చంద్రబాబు సైతం గట్టిగా ప్రశ్నించలేడు. ఇది రాజకీయంగా చంద్రబాబుకి గడ్డు పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉం?. చూడబోతుంటే రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయం మొత్తం ప్రత్యేక హోదా చుట్టూనే తిరుగుతుందని అనుకోవచ్చు.

# ఆర్థిక అవసరాల కోసం 8,274 వేల ఎకరాలు

**విజయవాడ :** ఏపీ సీఎం చంద్రబాబు అమరావతిని ప్రాధాన్యత ప్రాజెక్టుగా తీసుకున్నారు. అధికారంలోకి రాగానే రాజధానిపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. రాజధాని ప్రాంతంలో పర్యటించారు. తాజాగా శ్వేత పత్రం సైతం విడుదల చేశారు. ఇప్పటివరకు రాజధానిలో చేపట్టిన నిర్మాణాలు, ఖర్చులు, వాటి స్థితిగతుల గురించి వివరించారు. ఎన్ని కష్టాలు వచ్చినా అమరావతిపై బలంగా ముందుకు వెళ్తామని సంకేతాలు ఇచ్చారు. అదే సమయంలో ఆర్థిక అవసరాల కోసం అమరావతిలో కేటాయించిన భూముల వివరాలను సైతం స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుక్షణం అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభమయ్యాయి. విద్యుత్ వెలుగులు వచ్చాయి. అమరావతికి దగ్గరగానే చంద్రబాబు ఈ రాష్ట్రానికి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. అమరావతి రాజధాని శరవేగంగా నిర్మాణం జరుపుకుంటుందని సంకేతాలు ఇచ్చారు. ఇప్పుడు అందుకు తగ్గట్టుగా కార్యాచరణ ప్రారంభించారు.2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చంద్రబాబు సీఎం అయ్యారు. అందరి ఆమోదంతో అమరావతిని రాజధానిగా ప్రకటించారు. దాదాపు 53,748 ఎకరాల భూమిని రైతుల నుంచి సమీకరించారు. అయితే ఇలా సేకరించిన భూమిలో 8,274 ఎకరాలను ఆర్థిక అవసరాల కోసం వినియోగించనున్నట్లు ప్రభుత్వం శ్వేత పత్రంలో పేర్కొంది. పూలింగ్ సమయంలో ఇక్కడ భూమి నుంచి వచ్చే ఆదాయం ద్వారా రాజధాని నిర్మించుకోవచ్చు ని 2019కి ముందే చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధానికి సేకరించిన భూముల్లో కనీసం 8 వేల ఎకరాలు మిగులుగా ఉంటుందని నాడు పేర్కొన్నారు. ప్రస్తుతం విడుదల చేసిన శ్వేత పత్రంలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. మొత్తం సేకరించిన భూమిలో రోడ్లు ఇతర సదుపాయాల కోసం 27,885 ఎకరాలు, రైతులకు ప్లాట్లు తిరిగి ఇచ్చేందుకు 11826 ఎకరాలు, ఇతర అవసరాల కోసం 14,037 ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు. అయితే ఇతర అవసరాలు ఏమిటనేది శ్వేత పత్రంలో ప్రస్తావించలేదు.అయితే పక్కా ప్రణాళికలో భాగంగానే అమరావతిలో మిగులు భూమిని 8274 ఎకరాలను ఉంచినట్లు తెలుస్తోంది. నిధుల రూపంలో మార్చుకునేందుకు ఈ భూమిని అందుబాటులో ఉంచనున్నట్లు తెలుస్తోంది.టిడిపి ప్రభుత్వం అమరావతిని రాజధానిగా గుర్తించింది.ప్రపంచ నగరాల్లో ఒక అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దాలని భావించింది.అప్పట్లో అమరావతికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది. కానీ గత ఐదు సంవత్సరాలుగా వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో అమరావతి ర్యాంకింగ్ గణనీయంగా పడిపోయింది. దీంతో ఈ మిగులు భూమి విషయంలో ఎలా ఉపయోగించుకుంటారన్నది ప్రశ్నార్థకంగా మిగిలింది. ర్యాంకింగ్ లేకపోతే పెట్టుబడి సమస్యలు ముందుకు రావు. బ్యాంకులు రుణాలు ఇవ్వవు కూడా. అందుకే చంద్రబాబు ఈ మిగులు భూముల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. గతంలో సింగపూర్ సంస్థలు ముందుకు వచ్చాయి. ఇప్పుడు ఇతర దేశాల సంస్థలకు సైతం ఆహ్వానాలు పంపారు. అవి ఎంతవరకు మొగ్గు చూపాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.

# 2 కోట్లు భవనం.. 12 కోట్లా...

## బావ కళ్లలో ఆనందం కోసం

**కడప :** వడ్డించేవాడు మనవాడైతే కడ పంక్తి లో ఉన్నా.. పంచభక్ష పరమాన్నాలు దక్కుతాయి. అందుకే వైసిపి ఏలుబడిలో అస్మదీయులకు వ్యవస్థలను కట్టబెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. కడపలో అయితే చేసిందే చట్టం, చెప్పిందే న్యాయం అన్నట్టు వ్యవహారాలు నడిచాయి. పులివెందులలో అవినాష్ రెడ్డి సొంత బావ ఓ వెంచర్ వేసి బిల్డింగ్ కట్టడం ప్రారంభించారు. కనీసం రెండు కోట్ల రూపాయల కూడా చేయని బిల్డింగ్ ను.. రూ. 12 కోట్లు ఇచ్చి కొనుగోలు చేసింది పర్యాటక శాఖ. అంటే ఒకరోజు ఒప్పందంతో అవినాష్ రెడ్డి బావకు చేకూర్చిన ఆదాయం అక్షరాల 10 కోట్ల రూపాయలు.వైసీపీ నేతగా చలామణి అవుతున్న అవినాష్ రెడ్డి బావ పులివెందులలో ఎకరానార స్థలంలో ఒక వెంచర్ వేశారు. అక్కడ స్థలం విలువ అంతంత మాత్రమే.


అక్కడ వేసిన పిల్లర్లు, స్లాబ్ ఖర్చు రెండు కోట్లు కూడా చేయదు. వాస్తవానికి ఆ ప్రాంతంలో కొనుగోలు చేసేవారు కూడా తక్కువే. కనీసం అద్దెకు ఉండేందుకు కూడా ఎవరూ ముందుకు రారు. అక్కడ బిల్డింగ్ కట్టడంతో అంతా ఆశ్చర్యంగా చూశారు. కానీ అక్కడే ఒక ట్విస్ట్ ఉంది. ఇలా నిర్మాణంలో ఉన్న భవనాన్ని ఏకంగా పర్యాటక శాఖతో కొనుగోలు చేయించారు అప్పటి కలెక్టర్. పులివెందులలో ఫోర్ స్టార్ హోటల్ కట్టేందుకు సగం కట్టిన భవనం రెడీగా ఉందని.. రెండున్నర ఎకరాల్లో ఉందని కడప జిల్లా కలెక్టర్ పర్యాటక శాఖకు ప్రత్యేక రిక్వెస్ట్ చేశారు. అదే సమయంలో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు రావడంతో పర్యాటక శాఖ అధికారులు రూ. 12.50 కోట్లు చెల్లించి కొనుగోలు చేశారు.ఏకంగా అవినాష్ బావ ఖాతాలో పదిన్నర కోట్ల రూపాయల ఆదాయం చేరిపోయింది.

వాస్తవానికి అక్కడ భవనం కట్టింది ఎకరం నర స్థలంలోనే. అయితే కలెక్టర్ మాత్రం రెండున్నర ఎకరాల్లో ఉందని చెప్పడం విశేషం. అంతస్థలం లేకున్నా ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఆదేశాలు రావడంతో పర్యాటక శాఖ అధికారులు కొనేశారు. పన్నుల రూపంలో ప్రజల నుంచి సేకరించిన ఈ ఆదాయాన్ని గత ఐదేళ్లలో వైసీపీ పాలకులు ఎలా పంచుకున్నారు ఈ ఘటన తెలియజేస్తోంది. ఇలాంటివి ఎన్నెన్నో ఉన్నాయి. ఖజానా అంటే తమ సొంత సొమ్ముగా భావించి.. వైసీపీ పాలకులు పంచుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ దారుణాలు బయటపడుతున్నాయి. అయితే దీనిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందా? లేదా? అన్నది చూడాలి.

# మియాపూర్ లో వ్యక్తి దారుణ హత్య

**- మంచినీళ్లు తాగాడని కొట్టి చంపిన హోటల్ సిబ్బంది**





శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని మియాపూర్ లో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు.ఈ ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. మియాపూర్ లో సంతోష్ దాబా పక్కన చాయ్ బండి దగ్గర మంచినీళ్లు తాగడానికి ఇసుక లేబర్ సాయిలు వెళ్ళాడు. బాటిల్ లో నీళ్లు పట్టుకొని వస్తున్న సమయంలో నీళ్లు ఎందుకు తగావు అంటు గొడవ చేసిన చాయ్ బండి ఓనర్..ఆ తరవాత మాట మాట పెరగడంతో ఇద్దరి మద్య గొడవ జరిగింది.ఈ క్రమంలో సాయిలు అనే వ్యక్తి మీద ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. కాళ్ళు, చేతులు కట్టేసి దారుణంగా దాడి చేయడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు.తెల్లవారుజామున 4 గంటల సమయంలో స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు.మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# సత్య సాయి బాబా దేవాలయంలో ఎంపీపీ కొండ శంకర్.కి ఘన సన్మానం



మంథని ( ప్రశ్న న్యూస్) బుధవారం రోజున ఎంపీపీ గురుజి శ్రీ సత్యసాయి బాబా దేవాలయ కన్వీనర్ గంగ రాధా కిషన్ (శంకర్) అవధాని గంగాధర్ గార్ల ఆధ్వర్యంలో ఎంపీపీ కొండా శంకర్ కి శాలువాతో ఘనంగా సన్మానం చేసి సత్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు పదవీ కాల పరిమితి విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా మంథని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆత్మీయ సన్మాన అభినందన సభ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ కొండా శంకర్ ని ప్రజాప్రతినిధులు, అధికారులు, వారి కుటుంబ సభ్యులు, వారి అభిమానులు మెమొంటో ,పూల మాలలతో , శాలువాలతో ఘనంగా సన్మానించినారు అదేవిధంగా ఎంపీపీ ఐదు సంవత్సరాలు ప్రజలకు అందుబాటులో ఉండి ఎంతో ఓపిక, పట్టుదల, కృషితో ఎన్నో సమస్యలను పరిష్కరించారని గుర్తుచేశారు శ్రీ సత్య సాయి బాబా వారి దేవాలయం మెంబర్ గా 25 సంవత్సరాల సుదీర్ఘ ,సంబంధం మాతో కలిగిన వ్యక్తి కొండ శంకర్ అని కొనియాడారు వారి తండ్రి కీ"శే" కొండ మల్లయ్య మాకు 50 సంవత్సరాల నుండి అనుబంధం, పరిచయం కొనసాగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు వారు సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తి మంచి పేరుతో జీవించిన వ్యక్తిగా మాకు తెలుసని అన్నారు ఎంపీపీ మంచి పొల్ట్రీ, వ్యవసాయ రైతుగా కష్టపడ్డ వ్యక్తిగా మాకు తెలుసునని అన్నారు 30 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి ఎన్నో పదవులు చేపట్టి పదవులకే వన్నె తెచ్చే విధంగా పనిచేశారని అభివర్ణించారు ఈ కార్యక్రమంలో రామడుగు మారుతీ రావు, రాజమౌళి గౌడ్, గుర్రం నరసింహారావు, రేపాల శ్రీనివాస్, గంప శ్రీనివాస్, శారదమ్మ, పాల్గొని విజయవంతం చేశారు అనంతరం స్వీట్లు హలహారాలు స్వీకరించారు

# ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మీద విష ప్రచారం చేస్తున్న వారిపై చర్య తీసుకోవాలి




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) భారత పార్లమెంట్ ప్రతిపక్ష నేత ఎంపి రాహుల్ గాంధీ మీద విష ప్రచారం చేస్తూ ,ఫేస్ పై షూ సింబల్ పెట్టి ఫేస్బుక్లో ప్రచారం చేస్తు రాహుల్ గాంధీ పరువు ప్రతిష్టలకి భంగం కల్పిస్తున్న వారిపై మరియు ఫేక్ న్యూస్ ప్రచారాలు చేస్తు వారి ప్రతిష్టను దిగజర్చేలా చేసే వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని మనవి ఇలాంటి పోస్టు ఎవరైనా పెడితే వాళ్ళ పై చర్యలు తీసుకోవాలి "జిగుడు సుబ్బారావు"అనే వ్యక్తి సోషల్ మీడియాలో ఈ పోస్ట్ చేస్తుండు, ఇలాంటి అవమాన కర , దిగజారుడు పోస్ట్ లు చేసే ఇలాంటి వాళ్ళని, వీళ్ళని ప్రోత్సహంచే వాళ్ళని సహించే ప్రసక్తే లేదు ఇలాంటి పోస్ట్ లని చూసి ఉన్మాదం తో ఉన్న వ్యక్తులు దీన్ని షేర్ చేయడం జరుగుతుంది. వాళ్లందరిపై చర్యలు తీసుకోవాలని. ఇలాంటి పోస్ట్ లు చేసే వాళ్ళు రిర్రరిస్ట్ లతో సమానం వీళ్ళని సైబర్ క్రైమ్ కింద కేసు బుక్ చేసి వాళ్ళని వెంటనే శిక్షించాలని టీపీసీసీ సోషల్ మీడియా కోర్డినేటర్ లా పక్షాన విజ్ఞప్తి ఈ కార్యక్రమం లోటీపీసీసీ మెదక్ జిల్లా సోషల్ మీడియా కోర్డినేటర్ మల్లేష్ ముదిరాజ్టీపిసిసి నర్సాపూర్ నియోజకవర్గం సోషల్ మీడియా కోర్డినేటర్ సురేష్ సాయమోళ్ల నర్సాపూర్ మండలం సోషల్ మీడియా కోర్డినేటర్ ఎంవీస్ చక్రవర్తిశివంపేట మండల సోషల్ మీడియా కోర్డినేటర్ మహేష్ కో కోర్డినేటర్ రాజు ముదిరాజ్ తదితరులు రమేష్ గౌడ్ రెడిరెడ్డి పల్లి అశోక్ గౌడ్,సందిలా కృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

# కొత్తగూడెం డిఎస్పీ పై చర్యలు తీసుకోవాలి

**టియుడబ్ల్యూ జె (143 ) టిజెఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ కి పిర్యాదు**

కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) కొత్తగూడెం డిఎస్పీ పై చర్యలు తీసుకోవాలని శుక్రవారం టియుడబ్ల్యూజె (143) టిజెఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఐపిఎస్ కు జర్నలిస్ట్ బృందం పిర్యాదు చేశారు. దీనికి ఎస్పీ స్పందిస్తూ చర్యలు తీసుకోని జర్నలిస్టుకి న్యాయం చేస్తామని హామీ ఇవ్వటం జరిగింది. ఈ సందర్బంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షఫీ మాట్లాడుతూ న్యాయం కోసం వెళ్లిన పాల్వంచ మన తెలంగాణ రిపోర్టర్ పై కొత్తగూడెం డిఎస్పీ దూర్భశాలాడుతూ చేయి చేసుకోవటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామ్మన్నారు. ఉన్నతధికారులు కొత్తగూడెం డిఎస్పీపై తగిన చర్యలు తీసుకోకుంటే జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో న్యాయం జరిగే వరకు జిల్లా వ్యాప్తంగా పోరాటలను ఉదృతం చేస్తామన్నారు. ప్రభుత్వానికి, పోలీస్ శాకకు వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులపై కొత్తగూడెం డిఎస్పి దురుసుగా ప్రవర్తించటం సమంజసం కాదని వ్యాఖ్యనించారు. జిల్లా ఎస్పీ కి పిర్యాదు చేసినవారిలో యూనియన్ నేషనల్ కౌన్సిల్ మెంబెర్ చంద్ర నరసింహారావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు వట్టికొండ రవి, జిల్లా సహాయ కార్యదర్శి కె.ఈశ్వర్, జిల్లా గౌరవ అధ్యక్షులు మోటమర్రి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు వహేద్, జిల్లా కమిటీ సభ్యులు చీమకుర్తి రామకృష్ణ, అఫ్జల్, బి నరేష్, పి క్రాంతి కుమార్, రాజ్ కుమార్, కలీం, సంజీవ్, వెంకట్ నారాయణ గౌడ్, జి శ్రీకాంత్, యాకుబ్ పాషా, ఎస్ శ్రీకాంత్, కోటేష్ యాదవ్, స్వామి, శేఖర్, శ్రీనివాస్, చాంద్ సాహెబ్, హుస్సేన్, కాకటి బాబు, జాన్సన్ బాబు, సత్య ప్రకాష్, రాందాస్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అజాగ్రత్తతోనే కూలిన గార్డర్లు.

- ఆనాడే చర్యలు తీసుకుంటే ఇలా జరిగేది కాదు
- దోచుకోవడంపై ఉన్నదృష్టి సమస్యలపై ఉండదా
- నాడు ఎమ్మెల్యేగా ప్రతిపక్షంలో ఉండి పట్టించుకోలే
- ఓడేడ్ బ్రిడ్జి గార్డర్లు కూలిన బాధ్యత ఎమ్మెల్యేదే
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్





**మంథని ( ప్రశ్న న్యూస్)** ఎంపీ ఎలక్షన్ సమయంలో ముత్తారం మండలం ఓడేడ్ మానేరు వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి మూడు గార్డర్లు గాలికి కూలిపోతే పరిశీలించిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు తగిన చర్యలు తీసుకోకుండా అజాగ్రత్తగా వ్యవహరించడం మూలంగానే ఈనాడు మళ్లీ ఐదు గార్డర్లు కూలిపోయాయని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. శుక్రవారం ఓడేడ్ బ్రిడ్జి కూలిన గార్డర్‌లను ఆయన పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆనాడు కూలిన గార్డర్లను పరిశీలించిన ఎమ్మెల్యే బ్రిడ్జి నిర్మాణంలో అవినీతి జరిగిందని, మొత్తం బయటకు తీస్తానంటూ మాట్లాడాడని, మళ్లీ అటువైపు కన్నెత్తి చూడలేదన్నారు.ఆనాడే మూడు గార్డర్లు కూలిపోతే మిగితావి ఎలా ఉన్నాయని, వాటి పరిస్థితి ఏంటని పరిశీలన చేసి తదుపరి చర్యలు తీసుకుంటే ఈనాడు ఇలాంటి పరిస్థితి ఉండేది కాదన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా దోచుకోవడంపై ఉన్న దృష్టి ప్రజాసమస్యలపై లేదని విమర్శించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ. 50కోట్ల నిధులు తీసుకువచ్చామని, అయితే త్రీ పర్సంట్ లెస్‌తో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ అలసత్వం వల్ల మధ్యలోనే పనులు ఆగిపోయాయని అన్నారు. అయితే అటు తర్వాత ఎమ్మెల్యేగా గెలిచిన శ్రీధర్‌బాబు ఓడేడ్ బ్రిడ్జి గురించి ఆలోచన చేయలేదని, కనీసం పర్యవేక్షన చేయలేదన్నారు. ఓట్లపై ఉన్నశ్రద్ధ ప్రజాసమస్యలపై లేని ఎమ్మెల్యే మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయ్యారని,మంత్రి అయ్యాక దోపిడి పెరిగిందన్నారు. అన్నాతమ్ముళ్లు దోపిడిపై శ్రద్ధ పెట్టారే కానీ ఒక్కసారి కూడా అభివృద్ధిపై సమీక్ష చేయాలేదని ఎద్దేవా చేశారు. మట్టి, ఇసుక, ల్యాండ్ మాఫియాలకు తెరలేపారని అన్నారు. ఇసుక తాత ముత్తాతల ఆస్తి అన్న ఎమ్మెల్యే ఈనాడు ఇసుక తరలింపును ఎందుకు ఆపడం లేదో సమాధానంచెప్పాలన్నారు. ఎంపీ ఎన్నికల సమయంలో వచ్చి ఓడేడ్ బ్రిడ్జి కూలిన గార్డర్‌లను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటే ఈనాడు ఈ విపత్తు జరిగేది కాదని, ఇందుకు నైతిక బాధ్యత ఎమ్మెల్యే వహించాలన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పెద్దంపేట, మోదుడు ప్రజల కష్టాలను గుర్తించి బ్రిడ్జి నిర్మాణాలు చేశామని, గత తండ్రి కొడుకుల పాలనలో నియోజకవర్గంలో ఒక్కబ్రిడ్జినిర్మించలేదని, పీవీ నర్సింహారావు తర్వాత తానే ఈ ప్రాంతంలో బ్రిడ్జిలు నిర్మించిన చరిత్ర ఉందన్నారు. తనలాంటి బీసీ బిడ్డకు అధికారం వస్తే ఎలా ప్రజలకు దూరం చేయాలనే ఆలోచనలు తప్పప్రజలకు మేలు చేయాలనే ఆలోచన ఎమ్మెల్యే కుటుంబం ఏనాడు చేయలేదని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు.

# అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు.

**అక్రమ అరెస్టును ఖండించాలి**

**సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్.**



మంథని ( ప్రశ్న న్యూస్) నిరుద్యోగ జేఏసీ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమం మరియు బొగ్గు బ్లాక్ ల వేలం ఆపాలని సిపిఎం పార్టీ నిర్వహించే కలెక్టరెట్ ముట్టడి కార్యక్రమాలకు వెళ్లకుండా లిసిపిఎం పార్టీ జిల్లా కమిటీ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్,ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు బందెల రాజు కుమార్ లను మంథని పోలీస్ లు నిన్న సాయంత్రం అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. రాత్రి అంత పోలీస్ స్టేషన్ లో ఉంచి ఈ రోజు మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా బూడిద గణేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ జాబ్ క్యాలెండర్ ను వెంటనే ప్రకటించాలని గ్రూప్ 2 లో ఖాళీగా ఉన్న మిగతా పోస్టులన్నీ భర్తీ చేయాలని డిసెంబర్ వరకు పరీక్షను పొడిగించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా ఉద్యోగ నియామకలో ఎలాంటి ప్రక్రియ ప్రారంభించకుండా గత ప్రభుత్వం మాదిరిగానే నిరుద్యోగుల సమస్యల పట్ల నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం బొగ్గు గనులను వేలం వేసి ప్రవేట్ వ్యక్తులకు అప్పజెప్పడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు.మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాగును వేలం వెయ్యకుండా సింగరేణికే కేటాయించి తెలంగాణలో సిరుల సంపద నిలయమైన సింగరేణిని కాపాడాలని కోరారు. ఉద్యమకారులను ముందస్తుగా అరెస్ట్ చేయడం ప్రజాస్వామికమని విమర్శించారు.అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని ప్రజా సమస్యల కొరకు దృష్టి సారించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# బాధితుడికి సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ అందజేసిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ



శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) శేరిలింగంపల్లి సీఎంఆర్ఎఫ్ పథకం అత్యవసర పరిస్థితిలో పేదలకు ఆపన్న హస్తంగా నిలుస్తున్నది శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాయదుర్గం కి చెందిన బేబి ఆఫ్ ఆనమ్ ఫాతిమా అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా మంజూరైన రూ.75 వేలు ఆర్థిక సహాయానికి సంబంధించిన మంజూరి చెక్కు పత్రాన్ని బాధిత కుటుంబానికి ఆయన అందచేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. ప్రజాక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.ముఖ్యమంత్రి సహాయనిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకుడు చల్లా శోభన్ తదితరులు పాల్గొన్నారు.

# తూప్రాన్ సిఐ రంగాకృష్ణ ను సన్మానించిన జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ భాగ్యరాజ్



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) శుక్రవారం ఉదయం తూప్రాన్ కు నూతనంగా విచ్చేసిన పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ను రంగాకృష్ణను జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ భాగ్యరాజ్ ఆధ్వర్యంలో నాయకులు జై హనుమాన్ రియల్ ఎస్టేట్ నాయకులు ఘనంగా శాలువాతో సన్మానించి పూలమాలతో సత్కరించి స్వాగతం పలికారు ఈ సందర్భంగా బుడ్డ భాగ్యరాజ్ మాట్లాడుతూ తూప్రాన్ సర్కిల్ పరిధిలో శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా విధులు నిర్వహించడానికి తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు తూప్రాన్ పట్టణం మనోరబాద్ శివంపేట్ వెల్దుర్తి పోలీస్ స్టేషన్లో పరిధిలో సర్కిల్ విభాగం మంచి పని చేసి పేరు తీసుకురావాలని సిఐ కృష్ణ ని సూచించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి రమేష్, తాటి విశ్వం, నాగరాజుగౌడ్, పన్నీరురాము, బలరాం రెడ్డి, తూప్రాన్ మండల ఆర్ఎంపి%డ% పి.ఎం.పి డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అప్సర్ భాయ్, దొంతి యాదగిరి, డాక్టర్ ఆంజనేయులు, కిష్టాపూర్ రవి, బల్లెబోయిన మహేష్ యాదవ్, గెంట్యాల నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సోనూసూద్‌కు కుమారి ఆంటీ బంఫర్ ఆఫర్



శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) బాలీవుడ్ నటుడు సోనూ సూద్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు కరోనా కష్టకాలంలో ఎంతో మందికి సాయం చేసి రియల్ హీరో అనిపించు కున్నాడు.కాగా.. ఇటీవల ఆయన సోషల్ మీడియాలో ఫేమస్ అయిన కుమారి ఆంటీ ఫుడ్ స్టాల్‌ను శుక్రవారం సందర్శించారు.ఇందుకు సంబంధించిన వీడియోను తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశాడు.తాను కుమారి ఆంటీతో ఉన్నానని, ఆమె గురించి ఎంతో విన్నట్లుగా ఆ వీడియోలో సోనూసూద్ చెప్పుకొచ్చారు.ఉమెన్ ఎంపవర్మెంట్‌కి నిజమైన అర్థం ఇదేనని అన్నాడు. కుటుంబం కోసం స్త్రీలు ఎంతో కష్టపడుతు న్నారని, ఇందుకు కుమారి ఆంటీ సజీవ సాక్ష్యమన్నా డు.వెజ్, నాన్‌వెజ్‌లలో ఏదీ లభిస్తుందని అడుగగా..రెండు ఉంటాయని కుమారి ఆంటీ చెప్పింది.తాను వెజిటేరియన్ అని ప్లేట్ ఎంతా అని అడిగారు. వెజ్ అయితే రూ.80, నాన్ వెజ్ అయితే రూ.120 అని తెలిపింది.తాను రూ.80 కస్టమర్ అంటూ అక్కడ నవ్వులు పూయించాడు. సోనూసూద్ అదే సమయంలో తనకు ఎంత డిస్కౌంట్ ఇస్తారని అడుగగా.. మీకైతే ఫ్రీగానే పెడతానని చెప్పింది. ఈ రోజు నాకు లాటరీ తగిలింది ఫ్రీగా పెడతానంటే ప్రతి రోజు వస్తానని సోనూ అన్నాడు.మీరు ఎంతో మందికి సాయం చేశారు సార్ మీకు ఎంత పెట్టినా తక్కువే అంటూ కుమారి ఆంటి అంది.అనంతరం కుమారి ఆంటీని సోనూసూద్ ప్రేమతో సత్కరించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియా లో వైరల్‌గా మారింది.

# సాధారణ సర్వ సభ్య సమావేశం

**అభివృద్ధి పనులపై దృష్టి సారించండి: ఎంపీ ఈటల రాజేందర్**




ఘట్కేసర్ (ప్రశ్న న్యూస్) పోచారం మున్సిపల్ కార్యలయం లో జరిగిన సాధారణ సర్వ సభ్య సమావేశం లో ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ శుక్రవారం నాడు పోచారం మున్సిపల్ కార్యలయం లో మునిసిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అధ్యక్షన జరిగిన సాధారణ సర్వ సభ్య సమావేశం లో ముఖ్య అతిది గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ఎలాంటి ప్రజా సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ ఎన్ టి పి సి చౌరస్తా వద్ద బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని వినతి పత్రాలను అందించారు. అనంతరం 1కోటి 93 లక్షల అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. బిటిరోడ్లు ,సీసీ రోడ్లు భూగర్భ డ్రైనేజీ పనులు, పోచారం మున్సిపల్ పారిశుధ్య విభాగం నందు పనిచేసే పరిశుద్ధ కార్మికులకు యూనిఫార్మ్ సబ్బులు ఆయిల్ మొదలగువస్తు సామాగ్రి కొనుగోలు , పారిశుధ్య వస్తువులు కొనుగోలు, పలు అంశాలపై చర్చించడం జరిగిందని వర్డు లలో మౌలిక సదుపాయాల పెద్ద పీట వేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి వైస్ చైర్మన్ రెడ్డియా నాయక్, కమిషనర్ పస్యవేమన్ రెడ్డి కౌన్సిలర్లు గొంగల మహేష్, నర్రి ధనలక్ష్మి చింతల రాజశేఖర్ సింగిరెడ్డి సాయిరెడ్డి అకిటి శైలజ, మెట్టు బల్ రెడ్డి, బాలాగోని వెంకటేష్ గౌడ్,నల్ల వెల్లి లక్ష్మి, బెజ్జాంకి హరి ప్రసాద్ రావు,సామల శ్రీలత, అబ్బవతీ సరితా, మోటుపల్లి పోచమ్మ , సూర్వి సుదా లక్ష్మి, బద్దం మమతా కో ఆప్షన్ సబ్యులు అక్రమ్ ఆలి, శకుంతల, మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బస్సులో ప్రసవం.. తల్లి బిడ్డ క్షేమం

**ప్రసవానికి సహకరించిన కండక్టర్**

**ప్రసవం తర్వాత ఆసుపత్రిలో చేర్పించిన డ్రైవర్, కండక్టర్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సర్వీస్ నెంబర్ 81/1 రూట్ నెంబర్ 1 జెడ్ లో బస్సు నెంబర్ టీ ఏస్ 02 జెడ్ 0341 డ్రైవర్ ఎం. అలీ, కండక్టర్ సరోజ అరంఘర్ నుండి బయలుదేరి సికింద్రాబాద్ వచ్చు చుండగా గర్భవతి అయిన ఒక మహిళ ప్యాసింజర్ అరంఘర్ బస్ స్టాప్ లో ముషీరాబాద్ డిపో బస్సు ఎక్కడం జరిగింది. ఆ బస్సు బహదూర్ పూర్ వద్దకు రాగానే గర్భవతి శ్వేతం రత్నం కు పురిటి నొప్పులు రావడంతో బస్సు డ్రైవర్ బస్సును పక్కనే ఆపి పాసెంజర్స్ ను దించి అప్పుడు బస్ కండక్టర్ సరోజ తోటి ప్రయాణికుల సహాయంతో ఆ యొక్క గర్భవతికి డెలివరీ చేసినారు. ఆ యొక్క గర్భవతి ఒక ఆడ శిశువుకు సుమారు ఉదయం 7.30 కు జన్మనిచ్చారు. మరల అదే బస్సులో తల్లీ, బిడ్డలను క్షేమంగా గవర్నమెంట్ ఆసుపత్రి అయిన జడ్జి ఖానా తీసుకెళ్లి అక్కడ అడ్మిట్ చేశారు. ఈ యొక్క సంఘటన చూసిన తోటి ప్రయాణికులు డ్రైవర్ని, కండక్టర్ ని అభినందించారు

# సింగరేణి బొగ్గు గనుల బ్లాక్‌లను ప్రయివేటు పరం చేస్తే సహించేది లేదు

**- కేంద్ర గను శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తాం**

**- మండల కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్**



కూకట్ పల్లి (ప్రజా న్యూస్) కూకట్ పల్లి నియోజకవర్గం డివిజన్ పరిధిలోని బాలానగర్ సీపీఎం పార్టీ మండల కమిటీ నుండి చలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ప్రజలు, కార్యకర్తలు శు క్రవారం బయలుదేరారు. ఈ కార్యక్ర మంలో మండల కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్డీఏ లోని బీజేపీ కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల బ్లాక్ లను వేలం వేసి ప్రయివేటు పరం చేయాలని చూస్తున్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిని కాపాడుకుందామని సింగరేణి సంస్థకే బొగ్గు గనుల బ్లాక్ లు తెలంగాణకే చెందుతుందని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి బొగ్గు గనులను ప్రయివేటు పరం ఆలోచన చేస్తే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇంటిని ముట్టడించి తెలంగాణలో ఎక్కడ తిరగకుండా అడ్డుకుంటామన్నారు. బీజేపీ అంటే ఆదాని, అంబానీ మాత్రమె కాదని,140కోట్ల దేశ జనాభా అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యురాలు ఎ. విజయ, లక్ష్మీ, మైమద, రెజియా తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవలో ఉంటూ కార్యకర్తలకు అండగా ఉంటాం

**- కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుంది**

**- ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేందుకు కృషి చేస్తాం**

**కాంగ్రెస్ నాయకురాలు పట్నం సునీత మహేందర్ రెడ్డి**



కూకట్ పల్లి (ప్రశ్న న్యూస్) ప్రజాక్షేత్రంలో పదవిలో ఉన్న లేకున్నా ప్రజల కోసం తమ కుటుంబం పనిచేస్తూనే ఉంటుందని సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు పట్నం సునీత మహేందర్ రెడ్డి అన్నారు. మల్కాజ్ గిరి ఓటర్లకు రుణపడి ఉంటామని రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ నాయకురాలు పట్నం సునీత మహేందర్ రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ గా పదవీ విరమణ చేసిన సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో పట్నం సునీత మహేందర్ రెడ్డిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పట్నం సునీత మహేందర్ రెడ్డి రాజకీయ పనితీరు, సేవా కార్యక్రమాలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో కూడిన అంశాలతో రూపొందించిన సన్మాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పట్నం సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ మల్కాజ్ గిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా తాను ఇటీవల పోటీ చేసిన సందర్భంగా తనకు ఓటు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రజలకు సేవలు అందించేందుకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు. రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీల అమలులో భాగంగా ప్రజలు ఎంతగానో సంతోషంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. తాము ఎప్పుడు కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, దిండి అరవింద్ రెడ్డి, సంజీవరావు, మేకల మైకల్, చిన్న పాషా, అబ్దుల్ బాకీ, నాగమల్లేశ్వరరావు, బీ. బ్లాక్ అధ్యక్షురాలు రేష్మ, కూకట్ పల్లి నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ సంధ్యారాణి, పద్మ, సుందరి, రేణుక, యమున, పొడుగు అప్పారావు, ఫణీంద్ర కుమార్, రంగస్వామి, మధు, లుంగీ రాజు, రాజు ముదిరాజ్, కొమ్ము బాబు, శేషగిరిరావు, రాము, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 7న ఎటూరు నాగారంలో వాడబలిజ సేవా సంఘం సమావేశం.

**రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు డర్రా దామోదర్.**



వెంకటాపురం నూగూరు (ప్రశ్న న్యూస్) ములుగు జిల్లా ఎటూ రునాగారం లో ఈనెల 7వ తేదీన ఆదివారం ఉదయం 10 గంటలకు వాడ బలిజ సేవా సంఘం నూతన కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు, వాడ బలిజ సేవా సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షులు డర్రా దామోధర్ వెంకటాపురంలో శుక్రవారం సాయంత్రం మీడియా కు ప్రకటనను విడుదల చేశారు. ఏడు న ఏటూరు నాగారం మండల కేంద్రంలోని బి.ఆర్ .ఫంక్షన్ హాల్ నందు తెలంగాణ రాష్ట్ర వాడ బలిజ సేవా సంఘం నూతన కమిటీ పిలుపు మేరకు, వాడ బలిజ సేవా సంఘం ములుగు జిల్లా, మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీలు, మరియు రెండు జిల్లాల మండల కమిటీల ఎన్నిక లు నిర్వహించ నున్నట్లు తెలిపారు. కావున నూతన రాష్ట్ర కమిటీ మరియు, రెండు జిల్లాల వాడ బలిజ కుల సంఘం పెద్దలు, యువకులు, విద్యావంతులు, మేధావులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. ములుగు మరియు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీలు, మరియు మండల కమిటీల ఎన్నిక కు పూర్తిస్థాయిలో సహకరించాలని, రాష్ట్ర నూతన కమిటీ పిలుపునిచ్చారు. మన సంఘ మంతా సంఘ టితంగా ఉండి హక్కుల సాధన కోసం ఒక్క తాటిపై నిలిచి ప్రభుత్వం నుండి బి.సి. సంక్షేమ పథకాలు మంజూరు చేయించు కుందామని వాడ బలిజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు మండల కమిటీలు, జిల్లా కమిటీలు, రాష్ట్ర కమిటీలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు, కమిటీలు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. సమస్యపై వెంటనే స్పందించే చురుకైన కార్యకర్తలను సంఘం సభ్యులను, మనమంతా సమిష్టిగా ఎన్నుకొని మన సమస్యలు మన కమిటీలు, అనే భావనతో కలిసికట్టుగా ఉండి, ప్రభుత్వం నుండి హక్కులు సాధించుకోవాలని, ఈ సందర్భంగా రాష్ట్ర నూతన కమిటీ పిలుపునిచ్చింది. సమావేశానికి వాడ బలిజ సేవా సంఘం సభ్యులు, కులస్తులు, పెద్దలు,యువకులు అందరూ ఏటూరు నాగారం బిఆర్ ఫంక్షన్ హాల్లో జరిగే సమావేశానికి తరలిరావాలని, నూతన రాష్ట్ర సంఘం కమిటీ విజ్ఞప్తి చేసింది.

# సబ్సిడీ పథకాలపై అవగాహన సదస్సు



వాజేడు(ప్రశ్న న్యూస్) వాజేడు మండలం శ్రీరామనగర్ గ్రామంలో కాపేడు స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో రైతులకు సీజనల్ పంటలు మరియు ప్రభుత్వ%శీ% నుంచి రైతులకు వచ్చే సబ్సిడీలు



పథకాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లక్ష్మణ్, విఘ్నేష్ పాల్గొన్నారు. లక్ష్మణ్ మాట్లాడుతూ రైతులు అందరూ రైతుబంధుకు దరఖాస్తు చేసుకున్నార అని అడగటం జరిగింది. ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన పథకం క్రింద పంట నష్టపోయిన రైతులకు ఆర్థికంగా సాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పంట భీమా పథకాన్ని ప్రారంభించింది ఈ స్కీమ్ కోసం విపత్తు తెగుళ్ళు కరువు కారణంగా పంటలు దెబ్బతిన్నపుడు భీమా పథకం క్రింద ఆర్థిక సహాయం అందచేస్తారు అని తెలియ చేశారు. కిసాన్ క్రెడిట్ కార్డు గురుంచి తెలియ చేయటం జరిగింది. మరియు సీజనల్ గా పండించే పంటల గురించి వివరించటం జరిగింది. ఈ కార్యక్రమానికి వాజేడు మండల కోఆర్డినేటర్ కామేష్ యనిమాటర్స్ ప్రసాద్ భాస్కర్ రమాదేవి స్వరూప గ్రామస్తులు పాల్గొన్నారు

# తిప్పాపురంలో కార్టన్ అండ్ చర్చ్

**అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దు**

**వెంకటాపురం సిఐ బండారి కుమార్**



నూగురు వెంకటాపురం (ప్రశ్న న్యూస్) ములుగు జిల్లా నూగూరు వెంకటాపురం మండలం మారుమూల అటవీ ప్రాంతమైన తిప్పాపురం గ్రామంలో శుక్రవారం ఉదయం వెంకటాపురం పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బండారి కుమార్ ఆధ్వర్యంలో, కార్ట న్ అండ్ చర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ కే. తిరుపతిరావు పాల్గొన్నారు. గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా అపరిచిత,



అనుమానిత వ్యక్తులు గ్రామ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తే పోలీసువారికి సమాచారం ఇవ్వాలని, గ్రామస్తులను కోరారు. అసాంఘిక శక్తుల మాయమాటల వలలో పడరాదని కోరారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాల సంఖ్య పెరిగిపోతున్నదని,ఆయా నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. భవిష్యత్తులో సంభవించే గోదావరి వరదలు భారీ వర్షాలు కారణంగా వాగులు పొంగిన సమయంలో చేపల వేటకు వెళ్ళరాదని, ఈతల కు వెళ్ళరాదని , అప్రమత్తంగా ఉండాలని కోరారు. వరదల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం సహాయ సహకారాలు గ్రామస్తులు పొందాలని, పోలీస్ శాఖ తో పాటు ఇతర పౌర శాఖలు కూడా సేవలందిస్తాయని తెలిపారు. గ్రామీణ యువత విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలలో ముందుకు సాగాలని, గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు. బడి వయస్సు పిల్లలందరినీ పాఠశాలలకు పంపించాలని, విద్యా యొక్క ప్రాముఖ్యతను వివరించారు.అదేవిధంగా రాబోయే వర్షాలకు వాగులు వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సి.ఐ .కుమార్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ .ఐ. వెంకటాపురం కే. తిరుపతి రావు, సిఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ ఓభయ్యా, స్పెషల్ పార్టీ, సిఆర్పిఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఉప్పల శ్రీనివాస్ గుప్త



అంబర్ పేట (ప్రశ్న న్యూస్) ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా మరియు ట్రీకలర్ హాస్పిటల్ అంబర్ పేట వారి ఆధ్వర్యంలో రామంతపూర్ నల్ల పోచమ్మ దేవాలయం విశాల్ మార్ట్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన టి పి సి సి ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ అధ్యక్షులు మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు అందరూ సద్వినియోగ పరచుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో వైద్య ఆరోగ్య శాఖ సమర్థవంతంగా పనిచేస్తుంది అని 6 గ్యారెంటీలు తప్పక కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుంది అని ఆయన తెలిపారు.10 లక్షలు వున్న ఆరోగ్యశ్రీ నీ 15 లక్షలకు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి చెందుతుంది అని ఆయన అన్నారు.ఇలాంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన నిర్వహుకులకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పబ్బా శేఖర్ ,కటకం శ్రీనివాస్, బోనగిరి శ్రీనివాస్ గుప్త, అధ్యక్షులు సంభు పాండయ్య గుప్త, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రమేశ్ గుప్త, కోశాధికారి శ్రవణ్ కుమార్ గుప్త, ఉప కోశాధికారి నాగేష్ గుప్త, ఇంటర్నేషల్ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా మహిళ అధ్యక్షురాలు విశ్వనాథ సుజాత, ప్రధాన కార్యదర్శి జయమ్మ, కోశాధికారి లావణ్య, ఉప కోశాధికారి నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్ వెంకటన్నపై చర్యలు తీసుకోవాలి

**ఆర్టీసీ డీఎంకు వినతి అందజేసిన బీఎస్పీ నాయకులు**



గద్వాల (ప్రశ్నన్యూస్) ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికురాలను అగౌరవంగా మాట్లాడిన డ్రైవర్ వెంకటన్న పై చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకేపోగు రాంబాబు అన్నారు బస్సులో ప్రయాణించే ఇతర ప్రయాణికులను సైతం పరుష పదజాలంతో మాట్లాడడం జరుగుతుందని అన్నారు ఈ మేరకు శుక్రవారం ఆర్టీసీ డిఎం మంజులకు పార్టీ శ్రేణులతో కలిసి వినతిపత్రం సమర్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి నిత్యము ఆర్టీసీ బస్సు గద్వాల డిపో నుండి వావిలాల మీదుగా శాంతినగర్ కు వెళుతుందని ఈ క్రమంలో డ్యూటీలో డ్రైవర్ వెంకటన్న ఉన్నప్పుడు ప్రయాణికులను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని ప్రయాణికులు తమకు విన్నవిస్తున్నారని పేర్కొన్నారు మహిళా ప్రయాణికులను సైతం అగౌరవంగా మాట్లాడుతున్నారని ఆయన తెలిపారు క్రితంలో ఆర్టీసీ డిఎంకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని తెలియజేశారు డ్రైవర్ వెంకటన్న డ్యూటీలో ఉన్నప్పుడు ప్రయాణికులు బస్సులో ప్రయాణం చేయాలంటేనే భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. ఈ సమస్యపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్ కు కూడా ట్విట్టర్ ద్వారా పిర్యాదు చేశామని అన్నారు ప్రయాణికులపై అమర్యాదపూర్వకమైన ప్రవర్తన ఉన్న ఇలాంటి డ్రైవర్ పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఆర్టీసీ డిఎంకు విన్నవించారు వినతి పత్రం సమర్పించిన వారిలో బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మణికుమార్ గద్వాల నియోజకవర్గ ఉపాధ్యక్షులు సవరన్న పాల్గొన్నారు

# నీట్ పరీక్షను రద్దు చేయాలి

**తీన్మార్ మల్లన్న టీం జోగులాంబ గద్వాల్ జిల్లా అధ్యక్షులు**

**కొమ్ముల ప్రవీణ్ రాజ్**

**నీట్ పరీక్ష ను రద్దు చేయాలని**

**కర్నూలు రాయచూర్ రహదారి పై ధర్నా**



అయిజ (ప్రశ్న న్యూస్) తీన్మార్ మల్లన్న టీం ఆధ్వర్యంలో కర్నూలు రాయచూర్ రహదారిపై నీట్ పరీక్షను రద్దు చేయాలని ధర్నా చేశారు కొమ్ముల ప్రవీణ్ రాజ్ మాట్లాడుతూ పరీక్షల వ్యవస్థ విశ్వసనీయతను కోల్పోతే విద్యావ్యవస్థ కుప్పకూలుతుందని ప్రస్తుతం దేశం అదే ఎదుర్కొంటుందని తీన్మార్ మల్లన్న టీం జోగులాంబ గద్వాల్ జిల్లా అధ్యక్షులు కొమ్ముల ప్రవీణ్ రాజ్ పేర్కొన్నారు నీట్ పేపర్ లీక్ తో 23 లక్షల మంది విద్యార్థుల కష్టం వృథా అయిందన్నారు క్వశ్చర్ పేపర్ అమ్ముకొని ఏండ్లుగా కష్టపడి చదివిన విద్యార్థులకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు ఎన్నడూ లేని విధంగా 67 మందికి ఫస్ట్ ర్యాంకు ఒకే సెంటర్ లో 6 మందికి వందశాతం మార్కులు రావడంతో అవకతవకలు జరిగాయని నీట్ ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సీబీఐ తో కాకుండా గా సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కొమ్ముల ప్రవీణ్ రాజ్ డిమాండ్ చేశారు అదేవిధంగా పెపర్ లీక్ కు పూర్తి బాధ్యత ప్రధాని మోడీ గారే వాయించాలని కోరారు పేపర్ లీక్ చట్టం ప్రకారం నీట్ పరీక్ష లీక్ కు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు అదేవిధంగా నీట్ పరీక్ష పై విచారణ ముగిసే వరకు నీట్ కౌన్సెలింగ్ వాయిదా వేయాలని కోరుతున్నాం అన్నారు కొమ్ముల ప్రవీణ్ రాజ్ ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం గట్టు మండల కన్వీనర్ మోజేష్ తీన్మార్ మల్లన్న టీం మాల్దకల్ మండల కన్వీనర్ నీల నారసింహులు తీన్మార్ మల్లన్న టీం కెటిదొడ్డి కన్వీనర్ తిరుమలేష్ బి తిరుమల విద్యార్థులు తదితరులు ఉన్నారు

# బీఆర్ఎస్కు మరో భారీ షాక్

**- మండలిలో 12కు చేరిన కాంగ్రెస్ బలం**

**హైదరాబాద్** బీఆర్ఎస్ పార్టీకి దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. ఆ పార్టీ నేతలు ఒక్కొక్కరుగా 'కారు' దిగిపోతున్నారు. హస్తం గూటికి చేరుతున్నారు. అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. దండే విఠల్, భానుప్రసాద్, బుగ్గారపు దయానంద్, ప్రభాకర్రావు, ఎగ్గే మల్లేశం, బస్వరాజు సారయ్యలు అధికార పార్టీలో చేరారు. వీరంతా గురువారం రాత్రి సీఎం రేవంత్రెడ్డి నివాసానికి చేరుకున్నారు. ఆయన ఢిల్లీ నుంచి రావాల్సిన విమానం ఆలస్యమైంది. అర్ధరాత్రి దాటింది. అప్పటి వరకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు రేవంత్ నివాసంలోనే ఉన్నారు. ఢిల్లీ నుంచి రాగానే ఆయనతో భేటీ అయ్యారు. ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీల చేరికతో శాసనమండలిలో కాంగ్రెస్ బలం 12కు చేరింది. మండలిలో కూడా ఆధిక్యం కోసం కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. అందులో భాగంగానే బీఆర్ఎస్ సభ్యులను ఆకర్షిస్తోంది. గతంలో రాజకీయ పునరేకీకరణ అంటూ కేసీఆర్ చూపిన బాటలోనే ఇప్పుడు రేవంత్ కూడా పయనిస్తున్నారు. తన ప్రభుత్వానికి ఢోకా లేకుండా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆపరేషన్ ఆకర్ష్ శ్రీకారం చుట్టారు. శాసనమండలిలో మొత్తం సభ్యుల సంఖ్య 40 కాగా.. 2 సీట్లు ఖాళీగా ఉన్నాయి. కాంగ్రె?సకు ప్రస్తుతం ఆరుగురు సభ్యులున్నారు. గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న ఇద్దరు సభ్యులు కూడా అధికార కాంగ్రెస్ తరఫునే ఉంటారు. మొత్తం 8 మంది అవుతారు. తాజాగా ఆరుగురు చేరడంతో కాంగ్రెస్ బలం 14కు చేరుతుంది. అవసరమైనప్పుడు వామపక్ష టీచర్ ఎమ్మెల్సీ మద్దతు కూడా కాంగ్రె?సకే ఉండే అవకాశం ఉంది. ఇక కాంగ్రె?సకు మరో ఐదారు సీట్లు ఉంటే మెజారిటీ దక్కుతుంది. బీజేపీకి ఇద్దరు సభ్యులు ఉన్నారు. వీరు బీఆర్ఎ?సతో కలిసి పనిచేసే అవకాశం లేదు. అప్పుడు కీలక బిల్లుల విషయంలో రేవంత్ సర్కారుకు ఊరట లభిస్తుంది.

# విద్యార్థుల అరెస్టును ఖండించిన ఎర్రోళ్ల శ్రీనివాస్

**హైదరాబాద్** నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకుల అరెస్టుని బి.ఆర్.ఎస్ పార్టీ అధికార ప్రతినిధి డా. ఎర్రోళ్ల శ్రీనివాస్ ఖండించారు. కాంగ్రెస్ పార్టీ గత ఏడు నెలలుగా నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోలేదు. వారి సమస్యలను వినడానికి ఒక్క మంత్రి, అధికారి అందుబాటులో వారితో చర్చలు జరపకపోవడం సిగ్గుచేటు.

ఇది ప్రజా పాలన కాదు నిర్బంధ పాలన. పోలీసులు రాత్రి నుండే అమ్మాయిలని కూడా చూడకుండా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు అనేక ఆశలు కల్పించి ఎన్నికల్లో వారిని వాడుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని రొడ్డుకీడ్చింది కాంగ్రెస్. ఇప్పటికైనా వారితో చర్చలు జరిపి వారి యొక్క న్యాయపరమైన డిమాండ్లను, హామీలను నెరవేర్చాలి. సమస్యలు పరిష్కరించే దాక, డిమాండ్లు సాధించే దాకా వదిలిపెట్టం. విద్యార్థులు, నిరుద్యోగుల తరుపున గొంతెత్తుతామని అన్నారు.విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు, నిరుద్యోగుల అరెస్టులను తక్షణం నిలిపివేసి, అరెస్టులు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

## భూవివాదంపై కౌన్సిలర్
# శంకర్ నాయక్‌పై కేసు నమోదు

**మేడ్చల్** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,దుండిగల్ మున్సిపాలిటీ గాగిల్లపూర్ తాండాకు చెందిన బిఆర్ఎస్ పార్టీ 27వ వార్డు కౌన్సిలర్ శంకర్ నాయక్ పై దుండిగల్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదయింది..వివరాలలోకి వెళితే గాగిల్లపూర్ తాండాకు చెందిన కొర్ర వసంత కుటుంబానికి చెందిన సర్వే నంబర్ 157,158 లోని 5 గుంటల పట్టాభూమిని ఆక్రమించి ఓ నిర్మాణం చేపట్టడంతో బాధిత మహిళ పోలీస్ లను,మున్సిపల్ అధికారులను ఆశ్రయించింది,పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడన్న నెపంతో శంకర్ నాయక్,మోహన్ నాయక్,కొర్ర విజయ్ తదితరులు మహిళలను అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు దాడికి యత్నించాడంటూ దుండిగల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన పోలీస్ లు కొర్ర శంకర్ నాయక్ మోహన్ నాయక్,విజయ్ నాయక్ లపై సెక్షన్ 323,506 రెడ్ విత్ 34 ప్రకారం కేసు నమోదు చేసినట్లు దుండిగల్ సిఐ సిహెచ్ శంకరయ్య తెలిపారు.

## మల్కాజిగిరి ఎమ్మెల్యేపై దాడికి
# ప్రయత్నించిన కాంగ్రెస్ నాయకులు

**మేడ్చల్** మల్కాజ్గిరి మరోసారి రాజకీయ కక్షలతో రణరంగంగా మారింది. మల్కాజ్గిరి నియోజకవర్గం మౌలాలి ఆర్టీసీ కాలనీలో రోడ్డు పనులను సందర్శించడానికి వెళ్లిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పై మౌలాలి కాంగ్రెస్ నాయకులు దాడికి యత్నించారు. గత కొంతకాలంగా మౌలాలి డివిజన్ లోని ఆర్టీసీ కాలనీ రోడ్లు మరమ్మతులకు నోచుకోలేదు, తద్వారా స్థానిక ప్రజలు చాలా ఇబ్బందులకు గురయ్యారు. స్థానిక ప్రజల ఇబ్బందులపై ఎమ్మెల్యే అనేకసార్లు అధికారులతో చర్చించిన ఫలితం లేకపోయిందని బిఆర్ఎస్ వర్గాల ఆరోపణ , మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు చెరువుతోనే ఇప్పుడు పనులు ప్రారంభమయ్యాయని కాంగ్రెస్ నాయకుల వాదన. ప్రారంభమైన రోడ్డు పనులను పర్యవేక్షించడానికి ఎమ్మెల్యే చేరుకోగా కాంగ్రెస్ కార్యకర్తలు మరియు బిఆర్ఎస్ కార్యకర్తలు మధ్య తోపులాట జరిగింది.

# వైసీపీ మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదు



**కాకినాడ** వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిపై కేసు నమోదైంది. ఏ1గా మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి,ఏ2గా బళ్ల సూరిబాబు, మరో 24 మందిపై కాకినాడ రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నెల 2న కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని రాజ్యలక్ష్మీనగర్‌లో వైసీపీ నేత సూరిబాబుకు చెందిన అక్రమ కట్టడం కూల్చివేత ఘటనలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించారని వీరందరిపై అధికారులు ఫిర్యాదు చేశారు.

## పెద్ద అంబర్ పేట ఔటర్ రింగ్ రోడ్డు వద్ద
# పోలీసుల కాల్పులు



**నల్గొండ** కరడు కట్టిన పార్థీ ముఠా ఓ వ్యాన్లో ప్రయాణిస్తున్న విషయం తెలుసుకున్న నల్గొండ పోలీసులు వాళ్లను పట్టుకునేందుకు మాటు వేసారు. పోలీసులను చూసిన ముఠా సభ్యులు ఒక్క సారిగా పోలీసులపై దాడికి ప్రయత్నించారు. దాంతో పోలీసులు వారిపై కాల్పులు జరిపారు. కొంతమంది పార్థ ముఠా సభ్యులు పారిపోగా నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఔటర్ రింగ్ రోడ్ పెద్ద అంబర్పేట్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది

## తెలంగాణ ప్రభుత్వానికి
# ఎన్ హెచ్ ఆర్సీ నోటీసులు

**హైదరాబాద్** నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ (ఎన్ హెచ్ ఆర్సీ) తెలంగాణ విద్యాశాఖ ప్రధాన కార్యదర్శికి నోటీసులిచ్చింది. మౌలిక సదుపాయాల కల్పన మీద తీసుకుంటున్న చర్యల మీద 4 వారాల్లో వివరణ ఇవ్వాలని ఎన్ హెచ్ ఆర్సీ ఆదేశించింది. ప్రభుత్వ పాఠశాలల మౌలిక సదుపాయాల కల్పన మీద నివేదిక ఇవ్వాలని కోరింది. ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్స్ , మౌలిక సదుపాయాలు విద్యా ప్రమాణాలు బాగాలేవని ఎన్ హెచ్ ఆర్సీ కి కార్పొరేటర్ శ్రవణ్ కంప్లైంట్ చేసారు.

# జలమండలి ముందు ధర్నా

**హైదరాబాద్** పాత బస్తీ హనుమాన్ నగర్ లో డ్రైనేజీ వ్యవస్థ పనిచేయకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ బస్తీవాసులు రియాసత్ నగర్ లోని జలమండలి జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు బిజెపి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ర్షపు నీరు నిల్వ ఉండడం, మురుగు రోడ్లపై పారుతుండడంతో దోమలు, ఈగలు పెద్ద ఎత్తున వ్యాప్తి చెందుతున్నాయని తెలిపారు. దీనికి తోడు తాగునీరు కూడా కలుషితమవుతుండడంతో అంటు వ్యాధులుప్రబలుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు ముమ్మందు ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజలందరూ రోగాలతో మంచాన పడడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు.నీటి సమస్యను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# పెద్ద చెరువులో మృతదేహం లభ్యం

**రంగారెడ్డి** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో గుర్తు తెలియని 55 సంవత్సరాల వ్యక్తి మృతదేహం లభ్యమైంది.చెరువులో తేలియాడుతున్న మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం మార్చురికి తరలించారు.

## కడప-రాయచోటి ఘాట్లో 6 కి.మీ. సొరంగ మార్గం

**అమరావతి** కడప- రాయచోటి ఘాట్ రోడ్డు (గువ్వల చెరువు ఘాట్)లో వాహనదారుల కష్టాలు త్వరలో తీరనున్నాయి. ప్రమాదకరంగా ఉండే ఈ ఘాట్కు ప్రత్యామ్నాయంగా.. ఆ కొండకు సొరంగం తవ్వి, నాలుగు వరుసల రహదారి నిర్మించేందుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ఇందుకు రూ. 1,000 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్రంలో మొత్తంగా 14 జాతీయ రహదారులకు నిధులు మంజూరు చేసింది.

రూ.4,744 కోట్లతో 2024-25 వార్షిక ప్రణాళికకు రహదారి రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ (మోర్త్) ఆమోదం తెలిపింది.

కర్నూలు-చిత్తూరు ఎన్హెచ్లో భాగంగా కడప-రాయచోటి మధ్య ఉన్న ఘాట్లో 6 కి. మీ. మేర సొరంగం నిర్మించనున్నారు. నాలుగు వరసల రహ దారికి వీలుగా ఒక్కటే పెద్ద సొరంగం గానీ, లేక రెండేసి వరసల రోడ్లకు రెండు సొరంగాలు గానీ తవ్వి.. రోడ్లు వేయనున్నారు. వీటికి ఇప్పటికే కన్స ల్టెంట్ను నియమించారు. ఆ సంస్థ వివిధ చోట్ల బోర్లు వేసి, ఆ కొండలో రాయి ఎక్కడెక్కడ గట్టిగా ఉందనేది అధ్యయనం చేస్తోంది. ఇది పూర్తయ్యాక ఎలైన్మెంట్ ఖరారు చేసి, డీపీఆర్ సిద్ధం చేస్తారు.

## ఇక ట్రూ కాలర్
# అవసరం లేదు

**- జూలై 15వ తేదీ నుంచి కొత్త సేవలు**
**- కీలక నిర్ణయం తీసుకున్న ట్రాయ్**

తెలియని వ్యక్తులు, అన్ నోన్ నెంబర్స్ నుంచి కాల్స్ వస్తే ఎవరు చేశారో తెలుసుకునేందుకు ట్రూ కాలర్ యాప్ అందుబాటులో ఉంది. దానితో పాటు ఎన్నో యాప్స్ అందుబాటులో ఉన్నాయి. అయితే వీటిని ఉపయోగించే సమయంలో కన్ని రకాల సమస్యలు ఎదురవుతుంటాయి. ముఖ్యంగా ఇలాంటి థర్డ్ పార్టీ యాప్స్ ను ఉపయోగిచే సమయంలో మీ ఫోన్ కాల్స్ కి సంబంధించిన పర్మిషన్స్ యాప్ వాళ్లకు ఇవ్వాల్సి ఉంటుంది. మీ ఫోన్లోని కాంటాక్ట్స్ తో పాటు కాల్ వివరాలను సదరు యాప్స్ చేరుతాయి.అయితే ఇలాంటి సమస్య లేకుండా, అసలు ఏ యాప్ అసవరం లేకుండానే ఇకపై అన్ నోన్ నెంబర్స్ నుంచి వచ్చే కాల్ తెలుసుకోవచ్చు. ఇందుకోసమే టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై మీకు వచ్చే కాల్స్ వివరాలు ఏ యాప్ అవసరం లేకుండా స్క్రీన్ పై డిస్ ప్లే అవుతాయి. దీంతో మీకు ఎవరు కాల్ చేశారో తెలుసుకోవచ్చు. ఇందుకోసం ట్రాయ్.. నేమ్ ప్రెజెంటేషన్ సర్వీస్ ను యాక్టివేట్ చేయనుంది. జూలై 15వ తేదీ నుంచి ఈ సేవలను ట్రాయ్ ప్రారంభించనుంది.

# బద్వేలు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయానికి సొంత భవనం కరువు

**- స్థలం కేటాయించిన నిధులు ఇవ్వని ప్రభుత్వం**

**బద్వేలు** బద్వేలు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయానికి సొంత భవనం కరువైంది దశాబ్దాల తరబడి స్థానికంగా ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ఉంది సర్కిల్ పరిధిలో సుమారు ఏడు మండలాలు ఉన్నాయి సర్కిల్ కార్యాలయం మొదట్లో స్థానిక అశోక్ నగర్ లోని ఒక అద్దె భవనంలో ఉండేది అక్కడ కొన్ని సంవత్సరాల తర్వాత ఆ ఇంటి యజమాని ఖాళీ చేయమని చెప్పడంతో పట్టణంలోని మరో బాడుగ ఇంట్లోకి కార్యాలయాన్ని తరలించారు అక్కడ కూడా కొన్ని సంవత్సరాలు ఉన్న తర్వాత కాళీ చేయవలసి వచ్చింది ఆ తరువాత స్థానిక సిద్ధవటం రోడ్ లోని
తెలుగు గంగ కాలనీకి వెళ్లే దారిలో మరో అద్దె భవనంలో కార్యాలయాన్ని తరలించారు అక్కడ దాదాపు18 సంవత్సరాల పాటు కొనసాగింది తర్వాత ఆ ఇంటి యజమాని కూడా కాళీ చేయమని చెప్పడంతో అదే రోడ్డులోని మార్కెట్ యార్డ్ కార్యాలయంలో ఉన్న భవనంలోకి కార్యాలయాన్ని తరలించారు కార్యాలయం తరలించిన కొద్ది రోజుల్లోనే అప్పటి మహిళ సీఐ హిమబిందు భారీ మొత్తంలో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు ఆ తరువాత వచ్చిన సిఐ కూడా ఇదే తరహాలో వ్యవహరించి సస్పెండ్ కు గురయ్యారు దాంతో మార్పు చేసిన కార్యాలయం అచ్చి రాలేదని ఆ తర్వాత వచ్చిన అధికారులు పూజలు చేసి వినాయక విగ్రహాన్ని కార్యాలయం ముందు భాగంలో ఉంచారు ఆ విగ్రహం ఇప్పటికీ కార్యాలయం ముందు భాగంలో ఉంది ఎక్సైజ్ కార్యాలయం కోసం సిబ్బంది నివాస గృహాల కోసం స్థానిక బ్రేక్ ఇన్స్పెక్టర్ కార్యాలయం
పక్కనే దాదాపు రెండు దశాబ్దుల క్రితం స్థలం కేటాయించారు కానీ ఇప్పటివరకు ఎలాంటి పనులు చేపట్టలేదు దీంతో ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం అద్దె భవనాలకే పరిమితమైంది కేటాయించే స్థలంలో పనులు చేపట్టేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని స్థానిక అధికారులు పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు కానీ నిధులు మాత్రం మంజూరు కాలేదు దీంతో ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం అద్దె భవనాలకే పరిమితమైంది మద్యం అమ్మకాల వల్ల ప్రభుత్వానికి మంచి రాబడి వస్తుంది రాబడి తెచ్చే కార్యాలయానికి సొంతగూడు లేకపోవడం విచారకరం

## పేదల ముసుగులో అస్మదీయులకు
# ఇంటి స్థలాల కేటాయింపు

**బద్వేలు** మాజీ ముఖ్య మంత్రి అప్పట్లో జగనన్న 90రోజులు కార్యక్రమం ద్వారా సామాన్యులకు లబ్ధిచేకూరు సంగతి దేవుడెరుగు కానీ, అధికార పార్టీ నేతలకే అధిక లబ్ధి చేకూరుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంటి స్థలాలు కేటాయించాలని వందలాది మంది పేదలు పెట్టుకున్న అర్జీలకు అతీగతి లేదని, అధికార పార్టీ నేతలు కోరిందే తడవుగా, అధికారులు ఆగమేఘాల మీద నేతల బినామీలకు ఇంటి పట్టాలు మంజూరు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.తాజాగా సిద్దమ్మతల్లి గుడి సమీపంలో ఇంటి పట్టాలు మంజూరైన వైనం చర్చ నీయాంశంగా మారింది. గోపవరం గ్రామ రెవిన్యూ పరిధిలోని సర్వే నెంబర్515-1లొ అధికార పార్టీకి చెందిన ఓ రాష్ట్ర కోర్పొరేషన్ డైరెక్టర్, గోపవరం మండల పరిధిలోని ఓ ప్రముఖ శైవ క్షేత్ర పాలక మండలి చైర్మన్ తోపాటు,ఓ ఉన్నతాధికారి నివాసం ఉంటున్న ఇంటి యజమాని వీరు ముగ్గురు,పలుకుబడి ఉపయోగించితమ బినామీలైన12మందికి ఇంటి పట్టాలు పొందినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలకు 90రోజుల్లో ఇంటి పట్టాలు మంజూరు చేయాలనే సమున్నతాశయంతో రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న 90డేస్ ను స్థానిక అధికార పార్టీ నేతలు తమ లబ్ధి కోసం చక్కగా వినియోగించు కుని తమ బినామీల పేర్లపై డికేటీలు పొందడం పై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.పేదవాడు జానెడు జాగా కోసం కాళ్లరిగేలా రెవెన్యూ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నా ప్రయోజనం లేని నేపథ్యంలో అధికారులు అప్పటిఅధికారపార్టీ నేతలు వత్తిళ్లకు తలొగ్గి విలువైన ప్రభుత్వ స్థలాలను నేతల బినామీలకు కట్టబెట్టడంలొ గల ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు ప్రభుత్వ అవసరాల కోసం ఉపయోగించకుండా అత్యంత ఖరీదైన కోట్ల రూపాయలు విలువచేసే భూమిని అధికార పార్టీ నాయకులకు పట్టాలి ఇవ్వడం పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.నిబంధనల మేరకు రిమోట్ ఏరియాలో ఇంటి స్థలాలను మంజూరు చేయాల్సివుండగా నిబంధనలను తుంగలో తొక్కి జాతీయరహదారికి ఆనుకుని స్థలాలను మంజూరు చేయడంలో గల ఆంతర్యమేమిటన్నారు.గత సంవత్సరం ఇదే ప్రాంతంలో అప్పటి అధికారపార్టీకి చెందిన కొంతమంది ఆక్రమణలకు యత్నించగా మునుపటి బద్వేలు ఆర్డీఓనే ఆ కబ్జాలను అడ్డుకుని ఆ ప్రాంతంలో బోర్డు ఏర్పాటు చేయించడం గమనార్హం.ఉన్నతాధికారుల ఆదేశాలతోనే:ఉన్నతాధికారుల ఆదేశాల కనుగుణంగానే515-1లొలే ఔట్ వేసి12మందికి ఇంటి స్థలాలు మంజూరు చేసి పట్టాలు పంపిణీ చేశామని మునుపటి గోపవరం తాసిల్దార్ తెలియజేశారు.

# మొక్కలు నాటాలి.. సంరక్షణ చేయాలి

**హుస్నాబాద్** పట్టణంలోని తెలంగాణ మోడల్ స్కూల్ లో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరితో కలిసి మొక్కలు నాటారు.. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తల్లి పేరు మీద ప్రతి ఒక్కరు ఒక మొక్కలు నాటాలని దేశ ప్రధానమంత్రి చెప్పారు. మీరు కూడా మీకు ఇష్టమైన వారి పేరు మీద మొక్కను నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలి. మాస్కు, ఆక్సిజన్ ఎప్పటికీ పెట్టుకునే రోజులు రాకూడదంటే మన తక్షణ కర్తవ్యం వాతావరణ సమతుల్యాన్ని కాపాడుకోవడం కోసం మొక్కలను నాటి సంరక్షించుకోవడమే. సమాజంలో భావి భారత పౌరులుగా పాఠశాల స్థాయి నుండి ఇలాంటి సామాజిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనాలి.

అన్ని ఈవెంట్లలో విద్యార్థులు గెలిచిన ఓడిన పాల్గొనాలి. నాకెందుకులే అని కాకుండా నేను నేర్చుకోవాలి అనే పోరాట పటిమ ప్రదర్శించాలి. పోరాట పటిమ ఉన్నవాళ్లే చరిత్రలో నిలుస్తారు జిల్లాలో 21 లక్షల మొక్కలు నాటుటకు ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో హుస్నాబాద్ నియోజకవర్గం మొదటి స్థానంలో ఉండేలా వన మహోత్సవ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలి. ప్రభుత్వం మోడల్ స్కూల్ అందరిదీ.. తర్వాత జనరేషన్ విద్యార్థులకు మంచిగా అందించేలా ప్రస్తుత విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకోవాలి. పాఠశాలలో అవసరమైన అన్ని వసతులను సమకూరుస్తాము. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన వాతావరణాన్ని క్లీన్ గా మరియు గ్రీన్ గా ఉంచుకోవాలంటే మొక్కలను నాటి పెద్ద చేయడం ఒకటే మార్గం. గ్రీనరీ ని పెంచుటకు ప్రతి ఒక్క విద్యార్థి ఒక మొక్కను నాటి దాన్ని సురక్షితంగా సంరక్షించాలి. గెలుపు, ఓటములు సాధారణం ప్రతి విద్యార్థి తప్పనిసరిగా అన్ని రకాల కాంపిటేషన్లలో పాల్గొనాలి. తద్వారా జీవితంలో ఏ విషయంలోనైనా కాన్ఫిడెన్స్ పెరుగుద్ది. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గరీమ అగ్రవాల్, హుస్నాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత వెంకన్న, జిల్లా అటవీశాఖ అధికారి శ్రీనివాస్, హుస్నాబాద్ ఆర్డిఓ రామ్మూర్తి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, మున్సిపల్ కౌన్సిలర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరంపై
# జిల్లా పోలీసుల దాడులు

**- 6 లీటర్‌ల గుడుంబా పట్టివేత 90 లీటర్ ల బెల్లం పానకం ధ్వంసం**

**జగిత్యాల** గుడుంబా రహిత జిల్లా గా మార్చడమే జిల్లా పోలీసుల లక్ష్యం. గుడుంబా రహిత జిల్లాగా జగిత్యాలను చూడాలనే ప్రధాన లక్ష్యంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ఈరోజు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ తండాలో గుడుంబా స్థావరాలపై పోలీసులు మరియు ఎక్సైజ్ శాఖ వారితో సంయుక్తంగా దాడులు నిర్వహించడం జరిగింది. ఈ యొక్క దాడిలో 6 లీటర్ల గుడుంబాను,90 లీటర్ ల బెల్లం పానకం స్వాధీనం చేసుకొని గుడుంబా స్థావరాని ధ్వంసం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పై మాట్లాడుతూ. ఎవరైనా అక్రమంగా గుడుంబా తయారీ చేసినట్లయితే వారిని బైండోవర్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గుడుంబాకు అలవాటు పడి ఎంతోమంది కుటుంబాలను చిన్నబిన్నం చేసుకొని చివరకి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. అంతే కాకుండా మీ చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ఎవరైనా గుడుంబా తయారీ చేస్తున్నట్టు తెలిసిన, అమ్మిన వెంటనే పోలీసు స్టేషన్ కి సమాచారం అందించాలని కోరారు. వారి వివరాలు గొప్యంగా ఉంచడం జరుగుతుందని అన్నారు.



ఈ యొక్క తనిఖీల్లో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వినోద్ రాథోడ్, ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్, మరియు సిబ్బంది పాల్గొన్నారు

# 66 సెల్ ఫోన్ల రికవరీ

**సిద్దిపేట** గత కొన్ని రోజుల నుండి పడిపోయిన దొంగలించబడిన 66 ఫోన్లను రికవరీ చేసి



సంబంధిత బాధితులకు కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ అనురాధ చేతుల మీదుగా అందజేయడం జరిగింది.సెల్ ఫోన్ ఎక్కడైనా పడిపోయిన, ఎవ్వరైనా దొంగలించకపోయినా వెంటనే సీఈఐఆర్, డాటా నమోదు చేయాలి ఫోన్ రికవరీ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది.20-ఏప్రిల్- 2023 నుండి 920 సెల్ ఫోన్లు సిఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకుని సంబంధిత బాధితులకు అప్పగించడం జరిగింది.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. ఫోన్ దొరికిన బాధితులు మీ బంధువులలో, మీ గ్రామాలలో మీ స్నేహితులలో ఎవరిదైనా ఫోన్ దొంగతనం జరిగిన ఎక్కడైనా పడిపోయిన వెంటనే పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేయాలి అనే విషయం పై వారందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. వరకు జిల్లాలో సీఈఐఆర్ పోర్టల్ 2560 మంది సెల్ఫోన్ పోయినట్లు నమోదు చేసుకున్నారు. అందులో నుండి 920 సెల్ ఫోన్లు రికవరీ చేసి సంబంధిత బాధితులకు అప్పగించడం జరిగింది. మిగతా ఫోన్లు కూడా త్వరలో ట్రేస్ ఔట్ చేసి సంబంధిత బాధితులకు అప్పగించడం జరుగుతుంది.సెల్ఫోన్ పోయిందా.. అయితే టెన్షన్ పడకండి. వెంటనే సీఈఐఆర్ లాగిన్ అయి వివరాలు నమోదు చేసుకుంటే తొందర్లోనే ఫోన్ ఎక్కడుందో కనిపెట్టొచ్చని సిద్దిపేట పోలీస్ కమిషనర్ తెలిపారు. ప్రస్తుత రోజుల్లో చిన్నవాళ్ల నుంచి వృద్ధుల వరకు ప్రతిఒక్కరి జీవితంలో సెల్ఫోన్ ఒక భాగమైపోయింది. ఒక్కోసారి ఫోన్ కనిపించకపోయినా. ఎక్కడైనా పోగొట్టుకున్నా. ఎవరైనా దొంగిలించినా ఆ బాధ వర్ణణాతీతం. ఈ సమస్యను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక వెబ్ సైటను అందుబాటులోకి తీసుకొచ్చింది. అదే సీఈఐఆర్, సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్, సెల్ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్ వెబ్సైట్ లో పూర్తి వివరాలు నమోదు చేస్తే వీలైనంత తొందరగా దొరికే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కమిషనర్ తెలిపారు.

సీఈఐఆర్ లో ఎలా నమోదు చేసుకోవాలి. కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ఈ సీఈఐఆర్ అనే పోర్టల్ ద్వారా సెల్ఫోన్ పోయినా, దొంగతనానికి గురైనా వెతికి పట్టుకునేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. సెల్ఫోన్ పోయిన వ్యక్తి ముందుగా సంబంధిత పోలీస్ స్టేషన్ లో ముందుగా ఫిర్యాదు చేయాలి, లేదా మీసేవ కేంద్రానికి వెళ్లి లిలిలి.ఇవతితీ.ఐనీల.తిని అనే వెబ్సైట్లో లాగిన్ కావాలి. అందులో రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ లాస్ట్ , స్టోలెన్ అనే లింకై క్లిక్ చేసి, సెల్ఫోన్ నెంబర్, ఐఎంఈఐ నెంబర్, కంపెనీ పేరు, మోడల్, కొన్న బిల్లు అప్లోడ్ చేయాలి. దీంతో పాటు ఏరోజు, ఎక్కడ పోయింది. రాష్ట్రం, జిల్లా, పోలీస్టేషన్లో ఫిర్యాదు చేసిన వివరాలు నమోదు చేయాలి. చివరిగా వినియోగదారుడి పేరు, చిరునామా, గుర్తింపు కార్డు , ఈమెయిల్ ఐడీ, ఓటీపీ కోసం మరో సెల్ఫోన్ నెంబర్ ఇవ్వాలి. ఇదంతా. పూర్తయిన తరువాత ఒక ఐడీ నెంబర్ వస్తుంది. తద్వారా సంబంధిత ఐడీ ఫోన్ స్టేటస్ తెలుసుకోవచ్చు. ఏ కంపెనీ మొబైల్ అయినా సీఈఐఆర్ విధానం 24 గంటల్లోపు ఫోన్ పని చేయకుండా చేస్తుంది. సెల్ఫోన్ దొరికిన తర్వాత వినియోగదారుడు అదే వెబ్సైట్లోకి వెళ్లి అక్ ఫౌండ్ మొబైల్ అనే లింక్ పై క్లిక్ చేసి. ఐడీ నమోదు చేయగానే ఫోన్ అన్ బ్లాక్ అవుతుందని పోలీస్ కమిషనర్ తెలిపారు.

**సీఈఐఆర్ వెబ్సైట్ పై అవగాహన కార్యక్రమాలు** సీఈఐఆర్ సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్, గురించి ప్రజలకు అవగాహన కల్పించడం కోసం: సెల్ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరికీ సీఐఈఆర్ గురించి తెలిసేలా పోలీస్ స్టేషన్లో, సర్కిల్ పరిధిలో, డివిజన్ పరిధిలో బ్లూ కోర్ట్స్, పెట్రో కార్ సిబ్బందిచే అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని. సెల్ఫోన్ పోయిన వెంటనే తమ పరిధిలోని పోలీసులకు సమాచారం అందించి సీఈ ఐఆర్ అప్లికేషనన్ను సద్వినియోగం చేసుకోవాలని, ఫోను పెద్దదైన చిన్నదైనా అందులో ఉన్న డాటా చాలా ముఖ్యమని ఇప్పుడు ఆన్లైన్ ట్రాన్జక్షన్స్ ప్రతి ఒక్కరు కూడా సెల్ఫోన్ ద్వారానే చేయడం జరుగుతుందన్నారు. ఫోన్ ఎక్కడ పడిపోయినా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ లో సీఈఐఆర్ పోర్టల్ లో డాటా ఎంట్రీ చేసుకోవాలని కమిషనర్ ప్రజలకు సూచించారు.పోయిన ఫోను మళ్లీ దొరకదు అనుకున్న ఫోను, పోలీసులు టెక్నాలజీ ఉపయోగించి ఫోన్ రికవరీ చేసి అందించినందుకు సంబంధిత బాధితులు పోలీస్ కమిషనర్ పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఐటీ సెల్ ఎస్ఐ నరేందర్ రెడ్డి, ఐటీ కోర్ సిబ్బంది స్వప్న, శ్రీకాంత్, రమేష్, మల్లేశం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు రిజర్వేషన్లు 54 శాతం పెంచాలి

బీసీలకు రిజర్వేషన్లు 54 శాతం పెంచాలనిజాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజ్యసభ



ఎంపీ ఆర్. కృష్ణయ్య కోరారు.స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్లను జనాభా ప్రకారనీ 54% పెంచాలని, రాజ్యాంగాన్ని సవరించాలని, కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్ జాతీయ బిసి సంక్షేమ సంగం అధ్యక్షుడు రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య కలిసి నీరడి భూపేష్ సాగర్ మరియు రాజ్ కుమార్ నీల వెంకటేష్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ వడ్డేపల్లి హనుమంతు తదితరులు చర్చలో పాల్గొనడనీ జరిగింది .

# ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాం ఆదుకోండి

పూర్తి చేయడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్స్, ఫైనాన్షియల్ క్లస్టర్స్, ఎకనమిక్ కారిడార్‌లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. దీనికి అవసరమైన ప్రోత్సాహకాలను ప్రకటించాలని సూచించారు. త్వరలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోయే మధ్యంతర బడ్జెట్‌లో అమరావతి నిర్మాణానికి అవసరమైన ప్రత్యేక నిధులను పొందుపరచాలని ఈ సందర్భంగా చంద్రబాబు.. నిర్మల సీతారామన్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్ అభివృద్ధి కోసం అదనపు కేటాయింపులు చేయాలని కోరినట్లు చెబుతున్నారు. బుందేల్ ఖండ్ తరహాలో రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక ప్యాకేజీతో పాటు దుగరాజపట్నం ఓడరేవును పూర్తి చేయడానికి తక్షణ నిధులను మంజూరు చేయాలని చంద్రబాబు వివరించారు. ఆయనతో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎన్డీయే ఎంపీలు ఉన్నారు. తొలుత నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యంను సీఎం కలిశారు.

# కేసీఆర్‌కు కలిసిరాని సెంటిమెంట్

రేవంత్‌రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

### ఆరుగురు గైర్హాజరు..

ఇక తాజాగా జీహెచ్‌ఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలతో శుక్రవారం(జూలై 5న) సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఈ సమావేశానికి కూడా ఆరుగురు ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి, వివేకానంద, కృష్ణారావు, రాజశేఖరరెడ్డి, వివేకానంద సమావేశానికి హాజరు కాలేదు. ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్ కు ఆయన లక్కీ నంబర్ తోనే ట్రీట్మెంట్ ఇస్తున్నట్లు అర్థమవుతోంది. దీంతో ఆయన లక్కీ నంబరే రివర్స్ అయినట్లు కనిపిస్తోంది. కేసీఆర్ అదృష్టంగా భావించిన ఆరు నంబరే ఇప్పుడు ఆయనను వెక్కిరిస్తోందన్న సెటైర్లు పేలుతున్నాయి.

# నీట్ రద్దు చేయడం హేతుబద్ధం కాదు

అరెస్ట్ చేసినట్లు పేర్కొంది. నీట్ పరీక్షలో భారీ స్థాయిలో అక్రమాలు జరిగినట్లు ఆధారాలు లేవని వెల్లడించింది. ఇప్పటికే ఫలితాలు విడుదల కావడంతో పరీక్షను రద్దు చేయడం సరైంది కాదని సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో కేంద్రం తెలిపింది. ఇప్పుడు నీట్ పరీక్షను రద్దు చేస్తే నిజాయతీగా పరీక్ష రాసిన లక్షల మంది విద్యార్థులు నష్టపోతారని వెల్లడించింది.దేశంలోని వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు గానూ ఈ ఏడాది మే 5 వ తేదీన నిర్వహించిన నీట్-యూజీ 2024 పరీక్షలో అక్రమాలు, అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతుండటంతో ఆ పరీక్షను రద్దు చేసి మళ్లీ కొత్తగా నిర్వహించాలని కోర్టుల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఇక 1563 మంది విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలపడం, కొందరికి ఓఎంఆర్ షీట్లు అందకపోవడం, కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేయాలనే డిమాండ్ సహా నీట్‌ను రద్దు చేయాలని సుప్రీంకోర్టులో దాదాపు 26 పిటిషన్లు ఫైల్ అయ్యాయి. ఆ పిటిషన్లన్నింటినీ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ నెల 8 వ తేదీన విచారించనుంది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్ దాఖలు చేసింది. ఇక నీట్ పరీక్షను రద్దు చేయవద్దని కోరుతూ 56 మంది నీట్ ర్యాంకర్లు గురువారం సుప్రీంకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేయడం గమనార్హం. ఈ పిటిషన్లన్నింటిపై జులై 8 వ తేదీన సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరపనుంది. ఇక ఇదే నీట్ అంశంపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ - ఎన్‌టీఏ కూడా సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. నీట్ పరీక్ష రద్దు చేస్తే లక్షలాది విద్యార్థులకు నష్టం జరుగుతుందని పేపర్ లీక్ ఘటనలు మొత్తం నీట్ పరీక్ష నిర్వహణపై ఎలాంటి ప్రభావం చూపలేదని పేర్కొంది. నీట్ పరీక్ష చట్టవిరుద్ధమైన పద్ధతుల్లో కాకుండా న్యాయబద్ధంగా, గోప్యతతో నిర్వహించామని అందులో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని కోర్టుకు తెలిపింది.

# విభజన సమస్యలే అజెండాగా భేటీ

అపరిష్కృత సమస్యలపైనా చర్చకు ముందడుగు పడింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆయన చొరవతో ఈ ఏడాది మార్చిలో ఏపీ భవన్‌కు సంబంధించిన విభజన వివాదం పరిష్కారమైంది. ఇటీవలే మైనింగ్ కార్పొరేషన్‌కు సంబంధించిన నిధుల పంపిణీకి సంబంధించిన సమస్య సైతం పరిష్కారమయ్యాయి. విభజన వివాదాలపై ఇప్పటివరకూ ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య దాదాపు 30 సమావేశాలు జరిగాయి.

### ఆ 23 సంస్థల విషయంలో..

అయితే, షెడ్యూల్ 9లో ఉన్న మొత్తం 91 సంస్థల ఆస్తులు, అప్పులు, నగదు నిల్వల పంపిణీపై కేంద్ర హోంశాఖ షీలాబేడీ కమిటీ వేసింది. వీటిలో 68 సంస్థలకు సంబంధించి ఎలాంటి అభ్యంతరాలు లేవు. ఇక మిగిలిన 23 సంస్థల పంపిణీపై ఏకాభిప్రాయం కుదరలేదు. అటు, 10వ షెడ్యూల్‌లోని 142 సంస్థల్లో తెలుగు అకాడమీ, తెలుగు యూనివర్శిటీ, అంబేద్కర్ యూనివర్శిటీ వంటి 30 సంస్థల పంపిణీపై ఇంకా వివాదాలున్నాయి. ఈ అన్ని అంశాలపై శనివారం ముఖ్యమంత్రుల భేటీలో ఓ పరిష్కారం దొరకవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అలాగే, కృష్ణా జలాల పంపిణీ, కోర్టుల్లో ఉన్న పిటిషన్లు వెనక్కు తీసుకోవడం సహా.. భద్రాచలం మండలంలోని 5 గ్రామాలను తిరిగి తెలంగాణకు ఇవ్వడం, తెలుగు రాష్ట్రాల మధ్య ఉద్యోగుల విభజన, ఉమ్మడి సంస్థల ఆస్తులు, అప్పుల పంపిణీలో నెలకొన్న ప్రతిష్టంభన ఇలాంటి అనేక విషయాలు ఓ కొలిక్కి వస్తాయని ఇరు రాష్ట్రాల నేతలు, అధికారులు భావిస్తున్నారు. అటు, చంద్రబాబుకు ఘన స్వాగతం పలికేందుకు టీటీడీపీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే నగరంలో భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

# హైదరాబాద్‌లో చంద్రబాబుకు ఘనస్వాగతం

**హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి హైదరాబాద్‌లో శుక్రవారం (జులై 5న) రాత్రి ఘన స్వాగతం లభించింది. ఏపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారి హైదరాబాద్‌కు వచ్చిన చంద్రబాబుకు పార్టీ శ్రేణులు భారీ ఎత్తున స్వాగతం పలికాయి. ఢిల్లీ పర్యటన ముగించుకుని నేరుగా హైదరాబాద్‌కు చేరుకున్న చంద్రబాబు నాయుడు బేగంపేట విమానాశ్రయానికి శుక్రవారం సాయంత్రం వచ్చారు. చంద్రబాబు తొలిసారిగా హైదరాబాద్‌కు వస్తుండడంతో తెలంగాణలోని తెలుగుదేశం పార్టీ శ్రేణులు, చంద్రబాబు అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు విమానాశ్రయానికి భారీగా చేరుకున్నారు.వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు ర్యాలీగా విమానాశ్రయం నుంచి చంద్రబాబు నివాసానికి బయల్దేరారు. ఎక్కడికక్కడ తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆయనకు గజమాలలతో ఘనంగా సత్కరించారు. బేగంపేట విమానాశ్రయం నుంచి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం వరకు అభిమానులతో ర్యాలీగా చంద్రబాబు కాన్వాయ్ కదులుతోంది. వేలాది మంది కార్యకర్తలు రావడంతో కాన్వాయ్ ముందుకు సాగడం లేదు. జోరువానలోనూ కార్యకర్తలు భారీగా తరలిరావడం గమనార్హం. వర్షంలో తడుస్తూనే ర్యాలీగా ముందుకు సాగారు. అడుగడుగునా చంద్రబాబుకు కార్యకర్తలు ఆత్మీయ స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టు నుంచి వందలాది కార్లు, దిచక్ర వాహనాలతో ర్యాలీగా చంద్రబాబు కాన్వాయ్ ముందుకు సాగింది.

### జోరు వానలోనూ రోడ్ షో

చంద్రబాబు తొలిసారి హైదరాబాద్‌కు వస్తుండడంతో పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు స్వాగత ఏర్పాట్లు చేశాయి. ఫ్లెక్సీలు, స్వాగత తోరణాలను అభిమానులు, పార్టీ శ్రేణులు ఏర్పాటు చేశాయి. జోరు వానలోనూ పార్టీ కార్యకర్తలు వెంట రాగా చంద్రబాబు రోడ్ షో ముందుకు సాగింది. జై టీడీపీ, జై చంద్రబాబు నినాదాలతో అభిమానులు, కార్యకర్తలు ర్యాలీ వెంబడి నినాదాలు చేసుకుంటూ ముందుకు సాగారు. ఎయిర్‌పోర్టు నుంచి జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు ఇంటి వరకు ర్యాలీ కొనసాగింది. చంద్రబాబు రాకతో నగర పరిధిలోని అనేక ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. వేలాదిగా వాహనాలు వెంట చంద్రబాబు కాన్వాయ్ ర్యాలీగా ముందుకు సాగారు.

# కేసీఆర్‌కు, బీఆర్‌ఎస్‌కు సీతక్క లీగల్ నోటీసులు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, బీఆర్‌ఎస్ పార్టీకి మంత్రి సీతక్క శుక్రవారం లీగల్ నోటీసులు జారీ చేశారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారంటూ ఈ లీగల్ నోటీసులు ఇచ్చారు.

తన ప్రతిష్టకు భంగం కలిగేలా వీడియో పెట్టారని ఆరోపించారు. తనపై చేసిన తప్పుడు ప్రచారానికి గాను లిఖితపూర్వకంగా క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఇందిరమ్మ రాజ్యం ఇసుకరాళ్ల రాజ్యం పేరుతో సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెట్టారని పేర్కొన్నారు. జూన్ 24వ తేదీన బీఆర్‌ఎస్ అధికారిక సోషల్ మీడియా పేజీలో ఈ పోస్టులు పెట్టారు. నిరాధార ఆరోపణలు చేశారని, ఇది సరికాదని ఆమె పేర్కొన్నారు. తమపై చేసిన ఆరోపణలకు గాను తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

# జాబ్ కాలెండర్ ప్రకారమే ఉద్యోగాల భర్తీ

ఇప్పుడున్న నోటిఫికేషన్లు రద్దయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే 28,942 ఉద్యోగ నియామకాలు చేపట్టిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఏళ్లకు ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 నియామకాలకు ఉన్న కోర్టు చిక్కులన్నింటిని అధిగమించిందన్నారు. తెలంగాణలో జాబ్ క్యాలెండర్ ప్రకారం పోటీ పరీక్షలు నిర్వహించి, ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో చర్చించి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని రేవంత్ రెడ్డి చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నియామక పరీక్షలు, వివిధ బోర్డులు నిర్వహించే పరీక్షలతో ఆటంకాలు లేకుండా నిరుద్యోగులకు న్యాయం జరిగేలా క్యాలెండర్ ఉంటుందన్నారు. నిరుద్యోగుల విషయంలో తాము కసరత్తు చేస్తుంటే కొందరు మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని సీఎం రేవంత్ మండిపడ్డారు. కొందరి కుట్రలతో నోటిఫికేషన్లలోని నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటే ఉద్యోగాలు భర్తీ చేసే ప్రక్రియ నిలిచిపోయి, నిరుద్యోగులు మరింత నష్టపోతారని రేవంత్ చెప్పారు.

### తన నివాసంలో రేవంత్ రెడ్డి సమావేశం..

నిరుద్యోగుల ఆందోళనల దృష్ట్యా శుక్రవారం సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి తన నివాసంలో సమావేశం ఏర్పాటు చేశారు. దాదాపు 3 గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో నిరుద్యోగులకు సంబంధించిన డిమాండ్లు, జరుగుతున్న ఆందోళనలను గురించి అడిగి తెలుసుకున్నారు. వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు సంబంధిత అధికారులను పిలిపించి సీఎం మాట్లాడారు. నిరుద్యోగులు లేవనెత్తిన డిమాండ్లను పరిష్కరించేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలపై చర్చించారు. గ్రూప్ 1 పరీక్షకు ఒక్కో పోస్టుకు 1: 50 నిష్పత్తి చొప్పున కాకుండా 1: 100 చొప్పున మెయిన్స్‌కు ఎంపిక చేయాలనే డిమాండ్ పై సుదీర్ఘంగా చర్చ జరిగింది. గత ప్రభుత్వం 2022లో వేసిన గ్రూప్ 1 పరీక్ష పేపర్ల లీకేజీ, తప్పుడు నిర్ణయాల కారణంగా 2 సార్లు వాయిదా పడిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సుప్రీంకోర్టులో ఉన్న ఈ పిటిషన్ వెనక్కి తీసుకుందని అధికారులు సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసి అదనంగా మరిన్ని పోస్టులతో కొత్త నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. పన్నెండేండ్ల తర్వాత చేపట్టిన గ్రూప్ 1 పరీక్షకు నాలుగు లక్షల మంది అభ్యర్థులు పోటీ పడ్డారు.. ఇటీవలే ప్రిలిమినరీ పరీక్షను టీజీపీఎస్సీ పకడ్బందీగా నిర్వహించామన్నారు.

### నోటిఫికేషన్ ప్రకారమే మెయిన్స్‌కు ఎంపిక

గ్రూప్ 1 నోటిఫికేషన్ ప్రకారం ప్రిలిమ్స్ లో మెరిట్ ఆధారంగా ఒక్కో పోస్టుకు 50 మంది చొప్పున మెయిన్స్ కు ఎంపిక చేస్తారు. ఇప్పుడు 100 మందిని ఎంపిక చేసేలా నిబంధనలను సవరిస్తే కోర్టులు జోక్యం చేసుకునే ప్రమాదముంది, అదే జరిగితే మొత్తం నోటిఫికేషన్ మళ్లీ నిలిచిపోతుందని భావించారు. నోటిఫికేషన్‌లో ఉన్న నిబంధనలను మార్చితే న్యాయపరంగా చెల్లుబాటు కాదని సీఎంకు అధికారులు వివరించారు. గ్రూప్ 1 పరీక్ష రెండోసారి రద్దయినప్పుడు హైకోర్టు చేసిన వ్యాఖ్యలను సీఎంకు వివరించారు. అప్పటి నోటిఫికేషన్‌లో ఉన్న బయో మెట్రిక్ పద్ధతిని ఎందుకు పాటించ లేదనే ఏకైక కారణంతో రాష్ట్ర హైకోర్టు పరీక్షను రద్దు చేసిందని గుర్తు చేశారు. 1999లో యూపీఎస్సీ వర్సెస్ గౌరవ్ ద్వివేది కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గుర్తుచేశారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న దానికంటే ఎక్కువ మందికి అవకాశమిస్తే ముందుగా ఉన్నవాళ్లకు అన్యాయం జరిగినట్లే అని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు.

### పోస్టుల పెంపుపై చర్చ

తెలంగాణలో గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టుల పెంపు మీద కూడా చర్చించారు. పరీక్షల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో పోస్టులు పెంచటం కూడా నోటిఫికేషన్ ను ఉల్లంఘించినట్లే అవుతుందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గ్రూప్ 1 కు కొత్త నోటిఫికేషన్ ఇచ్చినందున పోస్టుల సంఖ్య పెంచటం సాధ్యమైందని, గ్రూప్ 2, గ్రూప్ 3 నోటిఫికేషన్లకు అలాంటి వెసులుబాటు లేదన్నారు. గ్రూప్ 2, డీఎస్సీ పరీక్షలు వెంట వెంటనే ఉండటంతో అభ్యర్థులు నష్టపోతున్నారని విద్యార్థి సంఘం నాయకులు సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు. జులై 17నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షలు ఉన్నాయని, ఆ వెంటనే 7, 8 తేదీల్లో గ్రూప్ 2 ఉండటంతో ప్రిపరేషన్‌ను ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. పరీక్షల తేదీల విషయంలో టీజీపీఎస్సీ, విద్యాశాఖతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి వారికి హామీ ఇచ్చారు.

# టీజీపీఎస్సీ ముట్టడి..

# ఉద్రిక్తంగా హైదరాబాద్

రైల్వే స్టేషన్లు మెట్రో స్టేషన్ లలో ఎక్కడికక్కడ చెక్పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించారు.అమీర్ పేట్, ఆర్టీసీ క్రాస్ రోడ్, దిల్షుక్ నగర్ మెట్రో స్టేషన్లలో ప్రయాణికులను తనిఖీ చేసి పంపుతున్నారు. మెట్రోలో టీజీపీఎస్సీకి నిరుద్యోగ ఆందోళనకారులు వస్తారని పోలీసులు కాపలా కాసారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలువురు నిరుద్యోగ జేఏసీ, బీజేవైఎం నేతలను అరెస్టు చేశారు. అన్ని జిల్లాల కేంద్రాలలోనూ టీజీపీఎస్సీ ముట్టడికి తరలివస్తున్న నాయకులను అరెస్ట్ చేశారు. నగరంలో పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఆందోళన కోసం వచ్చిన నిరుద్యోగులను, విద్యార్థి సంఘాల నాయకులను పోలీస్ స్టేషన్లకు తరలించారు. ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై నిరుద్యోగులు తీవ్ర అసహనం వ్యక్తం చేసారు. గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టుల సంఖ్య పెంచాలని ఈ ఏడాది మార్చి నుంచి నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూనే ఉన్నారు. వివిధ సందర్భాల్లో తమ నిరసనను ప్రభుత్వానికి తెలియజేస్తున్నారు. ఇక టీజీపీఎస్సీ ముట్టడి క్రమంలో టీజీపీఎస్సీ కార్యాలయం వైపు దూసుకెళ్లే ప్రయత్నం చేసిన విద్యార్థి సంఘం నేతలను కూడా అరెస్టు చేసిన పోలీసులు పోలీస్ స్టేషన్లకు తరలించారు. నిరుద్యోగుల ఆందోళనలతో హైదరాబాద్ హోరెత్తింది. రేవంత్ రెడ్డి తమ గోడు వినాలని, తమ డిమాండ్లను పరిష్కరించాలని యువత ఆగ్రహం వ్యక్తం చేసారు.

# తెలంగాణకు కొత్త ఎన్నికల కమిషనర్

ఆఫీసర్ గా ఐఏఎస్ అధికారి వికాస్ రాజ్ వ్యవహరిస్తున్నారని తెలిసిందే. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు, లోక్ సభ ఎన్నికలు సీఈవో వికాస్ రాజ్ నిర్వహించారు. తాజాగా తెలంగాణ సీఈవో వికాస్ రాజ్‌ను బదిలీ చేసిన ఈసీ ఆయన స్థానంలో సుదర్శన్ రెడ్డిని నియమించింది. సుదర్శన్ రెడ్డి ప్రస్తుతం జీఏడీ ముఖ్య కార్యదర్శిగా సేవలు అందిస్తున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు వికాస్ రాజ్ నిర్వహించగా, తెలంగాణలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ క్రమంలో వికాస్ రాజ్ ను బదిలీ చేస్తూ, ఆయన స్థానంలో సుదర్శన్ రెడ్డిని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారిగా నియమించారు.

# బ్రిటన్ కొత్త ప్రధాని కైర్ స్టార్మర్

రాణి ఎలిజబెత్ II నుంచి నైట్ పురస్కారం అందుకున్నారు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత తొలిసారి 2015 ఎన్నికల్లో లండన్ స్థానం నుంచి గెలిచి, పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. కైర్ భార్య విక్టోరియా నేషనల్ హెల్త్ సర్వీస్ విభాగంలో ఉద్యోగి. వీరికి ఇద్దరు సంతానం.2019 సార్వత్రిక ఎన్నికల్లో పేలవమైన ప్రదర్శన తర్వాత లేబర్ పార్టీని బలోపేతం చేసిన ఘనత కైర్‌కు దక్కుతుంది. కశ్మీర్ అంశంపై లేబర్ పార్టీ మాజీ నాయకుడు జెరెమీ కార్బిన్ భారత వ్యతిరేక వైఖరిని అవలంభించడంతో దూరమైన ప్రవాస భారతీయులను తిరిగి తమవైపు తిప్పుకోవడంలో కైర్ సఫలమయ్యారు. గతేడాది ఆయన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రపంచ భద్రత, వాతావరణ పరిరక్షణ, ఆర్థిక స్థిరత్వం కోసం భారత్‌తో బలమైన సంబంధాలను కోరుకుంటున్నట్టు వెల్లడించారు. 'భారత్‌తో ప్రజాస్వామ్య, ఆకాంక్షల విలువలపై ఆధారపడిన సంబంధాలను లేబర్ పార్టీ ప్రభుత్వం కోరుకుంటుంది స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పై మా అభిప్రాయాలను పంచుకుంటాం కానీ ఇదే సమయంలో ప్రపంచ భద్రత, వాతావరణ భద్రత, ఆర్థిక భద్రతకు కొత్త వ్యూహాత్మక భాగస్వామ్యం కూడా అవసరం" అని వ్యాఖ్యానించారు.అలాగే, 2024 ఎన్నికల మేనిఫెస్టోలోనూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం సహా భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కోరుకుంటున్నట్టు పొందుపరిచారు.

అలాగే, భద్రత, విద్య, సాంకేతికత, వాతావరణ మార్పులపై సహకారం ఆశిస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది తొలినాళ్లలో ఉత్తర లండన్ కింగ్స్‌బరీలో ఉన్న స్వామి నారాయణ్ ఆలయాన్ని దర్శించిన కైర్ హిందూ సమాజానికి ఎటువంటి భయాందోళనలు వద్దని భరోసా ఇచ్చారు. సర్రేలోని ఆక్స్టెడ్‌లో జన్మించిన స్టార్మర్ తండ్రి టూల్ మేకర్, తల్లి జోసెఫైన్ సాధారణ నర్సు. 2015లో ఆయన ఎంపీగా గెలవడానికి కొద్ది వారాల ముందే ఆమె అనారోగ్యంతో కన్నుమూశారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి లా పట్టభద్రుడైన కైర్ లేబర్ పార్టీ ప్రభుత్వ హయాంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. ఆయన ఫుట్‌బాల్ అంటే ఇష్టం. లేబర్ పార్టీ తొలి నేత కైర్ హార్డె పేరునే ఆయనకు తల్లిదండ్రులు పెట్టడం విశేషం. ఇక, మానవ హక్కుల లాయర్‌గా ఆయన రాజకీయాల పట్ల తన ఆలోచన విధానం అందరి కన్నా చాలా భిన్నంగా ఉంటుందని ప్రచారం చేసుకున్నారు.

రాజకీయాలను సేవకు వేదికగా మార్చాల్సిన అవసరం ఉందని కైర్ అభిప్రాయపడ్డారు.ఈ నేపథ్యంలోనే ఈ ఎన్నికల్లో గెలిచి బ్రిటన్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్న లేబర్ పార్టీకి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. బ్రిటన్ ప్రధాని పీఠం ఎక్కనున్న కైర్ స్టార్మర్‌కు శుభాకాంక్షలు చెప్పారు. ఈ సమయంలోనే కన్జర్వేటివ్ పార్టీ ఓటమిపై స్పందిస్తూ బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్‌ను ఓదార్చారు. ఈ మేరకు ప్రధాని మోదీ వరుస ట్వీట్లు చేశారు.

# ఆ పెద్ద తలకాయలను పట్టుకోండి

ఎర్ర చందనాన్ని అడ్డగోలుగా నరికేసి జిల్లాలు, రాష్ట్రాలు దాటించి విదేశాలకు అక్రమంగా తరలించేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పవన్ ఆదేశించారు. ఎర్ర చందనం స్మగ్లింగ్ అరికట్టేందుకు నిఘా వ్యవస్థను పటిష్టపరచాలని స్మగ్లర్లను అరెస్టు చేయడంతోపాటు వాళ్ళ వెనక ఉన్న పెద్ద తలకాయలను అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. మరోవైపు ఇటీవల కడప జిల్లాలో పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎర్ర చందనం డంప్ వివరాలను అధికారులు పవన్ కళ్యాణ్‌కు వివరించారు. ఈ కేసులో నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. అలాగే జగనన్న కాలనీలో దాచి ఉంచిన డంప్‌లో 158 ఎర్ర చందనం దుంగలు దొరికాయనీ, వీటి విలువ రూ.1.6 కోట్లు అని వివరించారు. ఈ నేపథ్యంలో శేషాచలం అడవుల్లో భారీగా ఎర్ర చందనం వృక్షాలను నరికేశారన్న డిప్యూటీ సీఎం ఆ దుంగలను ఎక్కడెక్కడ దాచారో తక్షణమే గుర్తించాలని అధికారులను ఆదేశించారు.అలాగే ఎర్ర చందనం స్మగ్లర్ల నెట్ వర్క్‌ను నడిపిస్తున్న కింగ్ పిన్స్‌ను పట్టుకోవాలని పవన్ అటవీశాఖ అధికారులను ఆదేశించారు. కూలీలను, స్మగ్లర్లను వెనుక ఉండి నడిపిస్తున్న ఆ పెద్ద తలకాయలను అరెస్ట్ చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. అలాంటి కింగ్ పిన్స్ ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకోకుండా కేసులు పకడ్బందీగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఎర్ర చందనం స్మగ్లింగ్ కేసులో అరెస్టై బయట బెయిల్ మీద తిరుగుతున్న వారిపై నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు.ఎర్ర చందనం స్మగ్లింగ్ కట్టడిలో అటవీ, పోలీస్ శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని పవన్ సూచించారు. మరోవైపు ఎర్ర చందనం స్మగ్లింగ్‌కు సంబంధించి ఎన్ని కేసులు నమోదయ్యాయి వాటిలో ఎంతమందికి శిక్షపడింది.. వీగిపోయిన కేసులెన్ని అనేదానిపై వివరాలు అందించాలని పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.

# టీడీపీ గూటికి వైసీపీ ఎమ్మెల్యేలు

**గుంటూరు :** వైసీపీ ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున పార్టీని వీడుతారా? టిడిపిలో చేరతారా? అనర్హత వేటు పడకుండా మండలిలోని వైసీపీ పక్షాన్ని టిడిపిలో విలీనం చేస్తారా? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. వైసిపికి ఘోర పరాజయం ఎదురు కావడంతో.. పార్టీ మారడం మేలన్న నిర్ణయానికి మెజారిటీ ఎమ్మెల్సీలు వచ్చినట్లు తెలుస్తోంది. దీనిపైనే అధినేత జగన్ ఆందోళనతో ఉన్నట్లు సమాచారం.పార్టీ నేతలతో సమీక్షలో జగన్ సైతం ఇదే ప్రస్తావన తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీల కదలికలు, ఎవరెవరు వెళ్లే అవకాశం ఉంది అన్నదానిపై చర్చించినట్లు సమాచారం.మండలిలో 57 మంది ఎమ్మెల్సీలకు గాను.. దాదాపు 38 మంది వరకు వైసిపి సభ్యులు ఉన్నారు. జగన్ ఓడిపోయినా మండలిలో బలం చూసుకుని సత్తా చాటాలని చూశారు. అధికారపక్షం దూకుడుకుచెక్ చెప్పాలని భావించారు. కూటమి ప్రభుత్వానికి ఇరుకున పెట్టాలని చూశారు. అమరావతి, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు వంటి కీలక బిల్లులను కూటమి సర్కార్ తీసుకురానుంది. వీటికి శాసనమండలిలో వైసిపి అడ్డు తగలడం ఖాయం. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ బిల్లులను వ్యతిరేకిస్తే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని వైసీపీ ఎమ్మెల్సీలు భయపడుతున్నారు. మరోవైపు పార్టీ పరిస్థితి ఏమంత ఆశాజనకంగా లేదు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. చాలామంది సీనియర్లు ఆ పార్టీలో చేరే అవకాశం ఉంది. అందుకే ఎమ్మెల్సీలు సైతం పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. అయితే చాలామంది ఎమ్మెల్సీలు గడప దాటేందుకు సిద్ధపడినట్లు సమాచారం.ఇది వైసీపీ శ్రేణుల్లో కలవరపాటుకు గురి చేసే అంశం.ఇప్పటికే ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి టీడీపీలోకి ఫిరాయించిన చాలామంది ఎమ్మెల్సీలపై అనర్హత వేటు పడింది. మండలి చైర్మన్ మోషేన్ రాజు వైసీపీకి చెందిన నేత. ఆయన ద్వారా తతంగాన్ని నడిపించారు. జగన్ నమ్మకం కూడా అదే. మండలి చైర్మన్ ద్వారా వైసిపి బలాన్ని నిరూపించుకోవాలని చూశారు. కానీ మెజారిటీ ఎమ్మెల్సీలు అలా భావించడం లేదు. అవసరమైతే ఒకేసారిగా టిడిపిలోకి ఫిరాయించేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. అనర్హత వేటు పడకుండా మండలిలో వైసీపీని టిడిపిలో విలీనం చేసేందుకు కూడా కొంతమంది యోచిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే చాలామంది ఎమ్మెల్సీలు టిడిపి నేతలకు టచ్ లోకి వచ్చినట్లు తెలుస్తోంది. కీలక బిల్లులకు మోక్షం కలగాలంటే ఇప్పుడు మండలిలో ఆమోదం అవసరం. అందుకే టిడిపి సైతం మండలి విషయంలో సీరియస్ గా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే జగన్ సైతం ఆందోళన పడుతున్నారు. బెంగళూరు నుంచి తాడేపల్లి కి వచ్చిన జగన్ క్యాంపు కార్యాలయంలో పార్టీ సీనియర్లతో సమావేశమయ్యారు. వైసీపీ ఎమ్మెల్సీలు చాలామంది పార్టీ మారే అవకాశం ఉందని అధినేత అభిప్రాయం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఎటువంటి పరిస్థితి ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు జగన్ చెప్పినట్లు తెలుస్తోంది.

# 15 రోజులు ఏడు వంతెనలు

**పాట్నా :** ఏదైనా నిర్మాణం చేపడితే పది కాలాలపాటు మన్నికగా ఉండాలనుకుంటాం. నిర్మాణ సంస్థలు కూడా ఈమేరకు ప్రమాణాలు పాటిస్తూ కట్టడాల నిర్మాణం చేపడతాయి. నిర్మాణ సమయంలోనూ క్వాలిటీని పరిశీలిస్తుంటారు. ఒక ఇంటి నిర్మాణం సమయంలోనే అనేక జాగ్రత్తలు తీసుకుంటాం. ఇక ప్రజల కోసం ప్రభుత్వాలు చేపట్టే నిర్మాణాల్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలి. కానీ బిహార్‌లో అలాంటి ప్రమాణాలు పటించినట్లు కనిపించడం లేదు. అందుకే ఆ రాష్ట్రంలో నిర్మిస్తున్న వంతెనటు పుట్టపుట్ట కూలిపోతున్నాయి. వరుసగా కూలిపోతున్న వంతెనలను చూస్తుంటే అవి బలమైన నిర్మాణాలా లేక పేకమేడలా అన్న సందేహం కలుగుతోంది.బిహార్ రాష్ట్రంలో గడిచిన 15 రోజుల వ్యవధిలో ఏడు వంతెనలు కుప్పకూలాయి. తాజాగా సివాన్ జిల్లా డియోరియా ప్రాంతంలో గండక్ నదిపై చిన్న వంతెన నిర్మాంచారు. దీనికి కొన్ని రోజులుగా మరమ్మతులు చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం(జూలై 3న) కొంత భాగం కూలిపోయింది. పది రోజుల క్రితం ఇదే జిల్లాలో ఓ వంతెన కుప్పకూలింది. పది రోజుల్లో రెండు వంతెనలు కూలిపోయాయి. తాజాగా కూలిన వంతెన 1982?83 మధ్య నిర్మించారు. ప్రమాదానికి కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.ఇక ఇటీవల బిహార్ రాష్ట్రంలోని కిషన్‌గంజ్ జిల్లాలో కంకయీ నదిపై నిర్మించిన ఓ వంఎతన కుంగిపోయింది. దీంతో బహదుర్‌గంజ్, దిఘాల్ బ్యాంక్ బ్లాక్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అంతకుముందు తూర్పు చంపారన్, సివాన్, ఆరారియా జిల్లాల్లో వంతెనలు కూలిపోయాయి. ఇలా గడిచిన 15 రోజుల్లోనే 7 వంతెనలు కూలిపోవడం గమనార్హం. వరుస ఘటనలతో వంతెనల నాణ్యతపై ఆందోళన వ్యక్తమవుతోంది.ఇక.. ఇప్పటి వరకు కూలిన వంతెనలు మొత్తం.. ఎవరూ లేని సమయంలో వాహనాలు వెళ్తున్న సమయంలో కూలిపోలేదు. కానీ, అవే వంతెనలు ప్రయాణికులు ఉన్న బస్సులు, పిల్లలు ఉన్న స్కూల్ బస్సులు వెళ్తున్న సమయంలో జరిగితే తీవ్ర ప్రాణ నష్టం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి వంతెనల నాణ్యతను పరిశీలించాలని బిహార్ ప్రజలు కోరుతున్నారు.

# నేడు మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి

భారత ప్రజలకు లభించిన 'అన్మోల్ రతన్' (అమూల్యరత్నం) అని కితాబు పొందిన ప్రజాసేవకుడు, బాబూ జగ్జీవన్ రామ్. పండిట్ నెహ్రూ నుంచి కార్యదక్షుడిగా మన్ననలను పొంది, అగ్రశ్రేణి నాయకుల్లో ఒకడుగా, భారత స్వాతంత్ర్య ఉద్యమంలోను, నవభారత నిర్మాణంలో ఉదాత్తమైన పాత్ర నిర్వహించిన జగ్జీవన్ రామ్, 1908, ఏప్రిల్ 5న బిహార్ రాష్ట్రంలోని షాబాద్ జిల్లా, చాంద్వా గ్రామంలో బసంతీదేవి, శోభిరామ్ దంపతులకు జన్మించారు. అప్పటి ఆచారాల ప్రకారం 8వ ఏటనే బాల్యవివాహం జరిగింది. ప్రాథమిక పాఠశాల విద్య ముగిసిన తర్వాత 1928లో ఆయన కాశీని వదలి కలకత్తాకు వెళ్లి అక్కడ 1931లో బిఎస్సీ డిగ్రీని పొందారు. చదువుకునే రోజుల్లో మదన్ మోహన మాలవ్యా, పండిత గోవింద వల్లభ పంత్‌లతో పరిచయం ఏర్పడింది. విద్యాభ్యాసం ముగిసిన తర్వాత బాబూ రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి దళితుల సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 1933లో భార్యా వియోగం జరగడంతో, 1935లో సంపన్న కుటుంబానికి చెందిన 'ఇంద్రాణి'ని వివాహం చేసుకున్నారు. బిహార్ రాష్ట్ర హరిజన సేవా సంఘ కార్యదర్శిగా పనిచేసారు. బిహార్‌లో భూకంపం సంభవించినప్పుడు మహాత్మాగాంధీతో పాటు జగ్జీవన్ రామ్ సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.. డాక్టర్ రాజేంద్రప్రసాద్, టక్కర్ బాబాల ఆశీర్వాదంతో రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి నాటి శాసనసభకు ఎన్నికయ్యారు. 1935 ఇండియా చట్టం కింద రాష్ట్రాల్లో మంత్రివర్గాలు ఏర్పడినప్పుడు బిహార్ రాష్ట్ర మంత్రివర్గంలో ఆయన మొదటిసారి పార్లమెంటరీ కార్యదర్శి అయ్యారు. 1937లో బిహార్ రాష్ట్ర కార్మికశాఖ మంత్రిగా పనిచేశారు. వ్యష్టి సత్యాగ్రహంలో పాల్గొని హజారిబాగ్ జైల్లో ఉన్నప్పుడు ఆయనకు జయప్రకాశ్ నారాయణ్‌తో పరిచయం ఏర్పడింది. డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, జగ్జీవన్ రామ్, జయప్రకాశ్ నారాయణ్‌లు బిహార్ త్రిమూర్తులుగా పేరు తెచ్చుకున్నారు. 1946లో నెహ్రూ నాయకత్వంలో అవిభక్త భారత్‌లో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వంలో కార్మికశాఖను నిర్వహించారు. 1947లో అంతర్జాతీయ కార్మిక సమావేశంలో పాల్గొని తిరిగివస్తుండగా, బస్రా సమీపంలో ఆయన ప్రయాణం చేస్తున్న విమానం ప్రమాదానికి గురైంది. తీవ్రంగా గాయపడిన ఆయన నెల రోజులపాటు బ్రిటీష్ సైనిక ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆ తర్వాత 1948లో హైదరాబాద్‌లో జరిగిన దళిత వర్గాల మహాసభకు ముదిగొండ లక్ష్మయ్య అధ్యక్షత వహించగా, జగ్జీవన్ రామ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 1952లో నెహ్రూ మంత్రివర్గంలో తపాలాశాఖను, 1956లో రైల్వేశాఖను నిర్వహించారు. తదనంతరం వ్యవసాయశాఖ మంత్రిగా దేశంలో హరి త విప్లవానికి కారణభూతుడై ఆహార ధాన్యాలను నిల్వ చేయడానికి వీలుగా "?భరత ఆహార సంస్థ" (ఎఫ్‌సిఐ), సెంట్రల్ వేర్ హౌజింగ్ కార్పొరేషన్‌లను ఏర్పా టు చేశారు.

# భారతీయుడు-2

## రన్‌టైమ్ 3.04 గంటలు

### సెన్సార్ బోర్డు యూ/ఏ సర్టిఫికెట్




ప్రముఖ నటుడు కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'భారతీయుడు 2'సినిమా 'భారతీయుడు'కు సీక్వెల్‌గా వస్తోంది. తాజాగా ఈ యాక్షన్ థ్రిల్లర్ సెన్సార్ పూర్తి చేసుకుంది. కొన్ని సూచనలు ఇస్తూ సెన్సార్ బోర్డు దీనికి యూ/ఏ సర్టిఫికెట్ ఇచ్చింది. 'భారతీయుడు 2' రన్‌టైమ్ ఏకంగా 3.04 గంటలు ఉంది. కొన్ని సన్నివేశాల్లో ఉపయోగించిన పదాలను మ్యూట్ చేయాలని సెన్సార్ బోర్డ్ చిత్రబృందాన్ని సూచించింది. ఇంత నిడివి ఉన్న చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకోవాలంటే అందుకు తగిన కథ, కథనాలు ఉండాలి. అయితే శంకర్ ఈ విషయంలో పూర్తి విశ్వాసంతో ఉన్నారు. దీని గురించి ఆయన మాట్లాడుతూ అన్ని సన్నివేశాలు అద్భుతంగా వచ్చాయన్నారు. జులై 12న ఈ సినిమా విడుదల కానుంది. ఇటీవల వచ్చిన 'యానిమల్', 'సలార్', 'కల్కి 2898 ఏడీ' చిత్రాలు మూడు గంటలకు పైగా రన్‌టైమ్‌తో విడుదలయ్యాయి. ఇప్పుడు వీటి జాబితాలో కమల్ హాసన్ 'భారతీయుడు 2' చేరింది. ఆ సినిమాలన్నీ విజయం సాధించి కలెక్షన్ల వర్షం కురిపించాయి. ఇప్పటికే 'భారతీయుడు 2'పై భారీ అంచనాలున్న నేపథ్యంలో ఈ చిత్రం కూడా మంచి వసూళ్లు సాధించడం ఖాయమని సినీప్రియులు అభిప్రాయ పడుతున్నారు. 'భారతీయుడు' 1996లో శంకర్ దర్శకత్వంలో వచ్చి సంచలనం సృష్టించింది. సేనాపతి పాత్రలో కమల్ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' మరోసారి మ్యాజిక్ చేసేందుకు సిద్ధమైంది. అవినీతిపై ఉద్యమం చేసే లక్ష్యంతో చిత్ర కథ నడవనుంది.

# అసలు కథంతా ముందున్నది

### కల్కి సీక్వెల్‌పై నాగ్ అశ్విన్ వ్యాఖ్య

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి 2898 ఏడీ' ప్రభంజనం సృష్టిస్తోంది. ఈ చిత్రానికి సీక్వెల్ ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే నిర్మాత పలు సందర్భాల్లో దాని గురించి మాట్లాడారు. తాజాగా మొదటిసారి నాగ్ అశ్విన్ 'కల్కి' సీక్వెల్‌పై స్పందించారు. అసలు కథ మొదలయ్యేది పార్ట్2లోనే అంటూ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. సీక్వెల్‌కు సంబంధించి నెలరోజుల షూటింగ్ చేశాం. దానిలో 20శాతం బెస్ట్‌గా వచ్చింది. ఇంకా ముఖ్యమైన యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించాల్సి ఉంది. వాటిని కొత్తగా ప్రారంభించాలి. ఈ సీక్వెల్‌లో కమల్ హాసన్, ప్రభాస్ , అమితాబ్ మధ్య భారీ యాక్షన్ సన్నివేశాలుంటాయి. అశ్వత్థామ, కర్ణుడు, యాస్కిన్‌ల మధ్య శక్తిమంతమైన ధనుస్సు కీలకం కానుందని అన్నారు. యాస్కిన్ పాత్రకు సీక్వెల్‌లో నిడివి ఎక్కువ ఉంటుందని ఇటీవల కమల్ కూడా చెప్పారు. దీంతో 'కల్కి2'పై ఆసక్తి పెరిగింది. ఈ సినిమాకు వస్తోన్న ఆదరణపై నాగ్ అశ్విన్ సంతోషం వ్యక్తం చేశారు. 'ప్రేక్షకులు దీన్ని ఎంతగానో ఎంజాయ్ చేస్తున్నారు.

ఎంతోమంది ఆడియన్స్ ఒకసారి కంటే ఎక్కువసార్లు దీన్ని వీక్షిస్తున్నారు. సినిమా విజయం సాధించిందని చెప్పడానికి అదే సంకేతం' అంటూ ప్రేక్షకులకు ధన్యవాదాలు చెప్పారు.జూన్ 27న ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కల్కి' కలెక్షన్లలో రికార్డులు సృష్టిస్తోంది. ఇప్పటి వరకు రూ.700కోట్లకు




పైగా వసూళ్లు చేసినట్లు చిత్రబృందం తెలిపింది. త్వరలోనే ఈ సైన్స్ ఫిక్షన్ రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయమని అభిమానులు అంటున్నారు. ఆడియన్స్‌ను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లిన ఈ చిత్రంలో అగ్ర నటులు అమితాబ్ బచ్చన్.. అశ్వత్థామగా, కమల్ హాసన్.. సుప్రీం యాస్కిన్‌గా ఆకట్టుకున్నారు. విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్ అతిథి పాత్రలతో అలరించారు. బౌంటీ÷టైర్ భైరవగా సందడి చేసిన ప్రభాస్.. చివరిలో కర్ణుడిగా కనిపించి పార్ట్ 2పై మరిన్ని అంచనాలు పెంచేశారు. ఇప్పుడు నాగ్ అశ్విన్ కామెంట్స్‌తో అవి రెట్టింపయ్యాయి.




## వినూత్న కథాంశంతో .. సరిపోదా శనివారం మూవీ

'సరిపోదా శనివారం'తో సినీప్రియుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు నాని. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని వివేక్ ఆత్రేయ తెరకెక్కిస్తున్నారు. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రియాంక అరుల్ మోహన్ కథానాయిక. ఎస్.జె.సూర్య కీలక పాత్ర పోషిస్తున్నారు. నాని ఇందులో సూర్య అనే పాత్రలో కనిపించనున్న సంగతి తెలిసిందే. ఆ పాత్రకు సంబంధించిన రెండో లుక్‌ను గురువారం విడుదల చేశారు. శనివారాల్లో యాక్షన్ కోణంలో హింసాత్మకంగా కనిపించే సూర్య.. మిగిలిన రోజుల్లో ఎలా ఉంటాడన్నది ఈ ప్రచార చిత్రంతో చూపించారు. నాని ఆ పోస్టర్‌లో పక్కింటి కుర్రాడి తరహాలో బైక్‌పై చిరునవ్వులు చిందిస్తూ రావడం కనిపించింది. 'వినూత్నమైన కథాంశంతో రూపొందుతోన్న యాక్షన్ చిత్రమిది. దీంట్లో నాని పాత్ర రెండు కోణాల్లో కనిపిస్తుంది. ప్రస్తుతం చిత్రీకరణ ముగింపు దశలో ఉంది' అని చిత్రవర్గాలు తెలిపాయి. ఇది ఆగస్టు 29న థియేటర్లలోకి రానుంది. సంగీతం: జేక్స్ బిజోయ్, ఛాయాగ్రహణం: జి.మురళి.

## చిన్నపిల్లల కథ..టీన్జ్ 12న విడుదల

దర్శకనటుడు ఆర్.పార్తిబన్ దర్శకత్వం వహించి సొంతంగా నిర్మించిన 'టీన్జ్' చిత్రాన్ని ఈ నెల 12న విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. అయితే, అదే రోజున విశ్వనటుడు కమల్ హాసన్ నటించిన 'ఇండియన్-2' చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు వస్తుంది. దీంతో కోలీవుడ్ బాక్సాఫీస్ వద్ద ఈ రెండు చిత్రాలు పోటీ పడనున్నాయి. 2022లో పార్తిబన్ నటించి దర్శకత్వం వహించిన నాన్‌లీనియర్ సింగిల్ షాట్ మూవీ 'ఇరవిన్ నిళల్' విడుదలై విజయం సాధించింది. ఈ సినిమాలో పాటల్లో నేపథ్య గాయని శ్రేయా ఘోషల్ ఆలపించిన 'మాయావి' పాటకు జాతీయ అవార్డు సైతం దక్కింది. ఇప్పుడు మరో వైవిధ్యభరితమైన కథతో అందరూ చిన్నపిల్లలే నటించిన 'టీన్జ్' మూవీ తెరకెక్కించారు. చైల్డ్ సెంట్రిక్ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రానికి డి.ఇమాన్ సంగీతం అందించారు. కావ్‌మిక్ ఆరి సినిమాటోగ్రఫీ అందించగా, బయోస్కోప్ డ్రీమ్స్, ఆకీరా ప్రొడక్షన్స్ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా తెరకెక్కించాయి. ఇప్పటికే విడుదల చేసిన ఈ సినిమా టీజర్ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది.




## అమెజాన్ కోసం రానా షో



ప్రముఖ నటుడు రానా దగ్గుబాటి తెలుగులో సినిమా చేసి చాలా కాలం అయింది. 2022 లో పవన్ కళ్యాణ్ తో చేసిన 'భీమ్లా నాయక్' తరువాత వచ్చిన 'విరాట పర్వం' విడుదలైన తరువాత, రానా తెలుగు సినిమా చెయ్యలేదు. సుమారు రెండు సంవత్సరాలకి పైగా అయింది, రానా తెలుగు సినిమా వొప్పుకొని. అయితే ఇప్పుడు రానా దగ్గుబాటి తమిళ సినిమా చేస్తున్నారు. రజినీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న 'వెట్టియాన్' లో రానా విలన్ గా నటిస్తున్నాడు. దీనికి 'జై భీం' ఫేమ్ టిజె జ్ఞానవేల్ దర్శకుడు. ఈ సినిమా చిత్రీకరణ ఇంకా కొంచెం మిగిలి వుంది అని తెలిసింది. ఇదిలా ఉండగా రానా దగ్గుబాటి ఈమధ్య చాలా చిన్న సినిమాలని ప్రోత్సహిస్తున్నాడు. ఇంతకు ముందు 'పరేషాన్' అనే సినిమాని ప్రోత్సహించినట్టుగానే ఇప్పుడు '35' అనే సినిమాకి రానా ముందుండి నడిపిస్తున్నాడు. అలాగే మలయాళం సూపర్ స్టార్ దుల్కర్ సల్మాన్ తో ఒక సినిమా నిర్మిస్తున్నాడు రానా. ఈ సంవత్సరం ఈ సినిమా చిత్రీకరణ మొదలవుతుందని తెలుస్తోంది. ఇవి కాకుండా రానా దగ్గుబాటి అమెజాన్ ప్రైమ్ వీడియో కోసం ఒక షో చేస్తున్నట్టుగా తెలిసింది. ఈ షో కి 'ది రానా కనెక్షన్' అని పిలుస్తున్నారు. ఇందులో రానా దగ్గుబాటి దక్షిణాదికి చెందిన అగ్ర నటులను ఒక దగ్గరకి చేర్చి వారితో సంభాషించనున్నట్టుగా తెలుస్తోంది. అయితే ఇంతకు ముందు నటులతో చాలా షో లు వచ్చినా, రానా ఇది తన మార్కు వుండేటట్టుగా ఒక అద్భుతమైన కాన్సెప్ట్ తో వెళుతున్నట్టుగా తెలిసింది. ఈ షో కోసమని రామానాయుడు స్టూడియో లో ఒక సెట్ కూడా తయారవుతోంది అని వినికిడి. అలాగే కొన్ని తెలుగు సినిమాలు కూడా ఈ సంవత్సరం ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇవన్నీ కాకుండా 'రానా నాయుడు' వెబ్ సిరీస్ రెండో సీజన్ చిత్రీకరణ జరుగుతోంది. ఇందులో తన చిన్నాన్న వెంకటేష్ తో నటిస్తున్న సంగతి తెలిసిందే. మొదటి సీజన్ అద్భుతమైన విజయం సాధించింది.

# ఎన్‌ఆర్‌కె 21 టైటిల్‌తో నందమూరి కళ్యాణ్ రామ్ తాజా చిత్రం

నందమూరి కళ్యాణ్ రామ్ తాజాగా నటిస్తున్న కొత్త చిత్రం ఎన్‌ఆర్‌కె 21.. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్నాడు. ఎన్టీఆర్ ఆర్ట్స్, అశోక క్రియేషన్స్ అశోక్ వర్ధన్ ముప్పా , సునీల్ బలుసు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ పరిసరాల్లో శరవేగంగా జరుగుతోంది. అయితే ఈ రోజు కళ్యాణ్ రామ్ జన్మదినం సందర్భంగా మేకర్స్ సినిమా నుంచి ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసి కళ్యాణ్ రామ్‌కు పుట్టిన రోజు శు భాకాంక్షలు తెలిపారు.

ఆ పోస్టర్‌లో చుట్టూ మనుషులు అగ్నికి అహుతై ఉండగా చేతిలో నిప్పుతో కల్యాణ్ రామ్ ఉన్న లుక్‌ను విడుదల చేసారు. మీరు ఆదర్శంగా ఉండలేకపోతే భయపెట్టే వాడిలా ఉండండి' అంటూ డైలాగ్స్ ట్యాగ్ చేశారు. చిత్రంలో సాయి మంజ్రేక్ హీరోయిన్‌గా నటిస్తుండగా, లేడీ సూపర్ స్టార్ విజయ శాంతి ఓ కీలక పాత్ర పోషిస్తుంది. వీరితో పాటు బాలీవుడ్ నటుడు సోహైల్ ఖాన్, శ్రీకాంత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ ఎడాది చివరలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.



# పడకేసిన పాలన..

## సమస్యల వలయంలో తెలంగాణ పల్లెలు

### - గ్రామాల్లో అభివృద్ధిని మరిచిన కాంగ్రెస్ సర్కారు

- పారిశుద్ధ్య లోపం ప్రజలకు శాపం
- గ్రామ పంచాయతీలను పట్టించుకోని ప్రత్యేకాధికారులు
- వారానికోసారి కూడా గ్రామాలకు రాని వైనం
- నిధుల కొరతతో పంచాయతీలు విలవిల
- గ్రామాల్లో పేరుకుపోతున్న సమస్యలు
- క్షీణిస్తున్న పారిశుధ్య నిర్వహణతో అనారోగ్యాల బారిన ప్రజలు
- ప్రత్యేక అధికారుల పాలనలో అభివృద్ధి, పారిశుద్ధ్య లోపం
- పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న ప్రజలు
- అభివృద్ధి చేయడంలో అధికారులకు గుదిబండగా మారిన వైనం
- వచ్చి ఏడు నెలలైనా రూపాయీ కేటాయింపులేదు
- గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం.. ఎక్కడ చూసినా మురుగుపరుగే
- సమీపిస్తున్న వానకాలం, వ్యాధులు ప్రబలే ప్రమాదం
- గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలంటున్న ప్రజలు
- గత బీఆర్ఎస్ హయాంలో స్వచ్ఛ పల్లెలుగా గ్రామాలు ఏడు నెలల్లోనే మారిన పరిస్థితి

**(ఆర్ కె - ప్రశ్న న్యూస్ బ్యూరో )**




గ్రామాల్లో పల్లె ప్రగతి పడకేసింది. నిధుల కొరతతో గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో పల్లెల్లో దుర్గంధం రాజ్యమేలుతోంది.గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. బీఆర్ఎస్ హయాంలో స్వచ్ఛ పంచాయతీలుగా మారిన పల్లెల్లో ప్రస్తుతం ఎక్కడ చూసినా మురుగునీటి ప్రవాహం, చెత్తాచెదారం దర్శనమిస్తున్నది. గతంలో ప్రతినెలా విడుదలయ్యే నిధులతో సర్పంచ్‌లు, అధికారులు గ్రామాల్లో రోడ్లు, మురుగు కాల్వలను శుభ్రం చేయించేవారు. కానీ ఏడు నెలల క్రితం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీలకు రూపాయి కూడా కేటాయించకపోవడంతో పాలన పూర్తిగా పడకేసింది. గ్రామ పంచాయతీ సర్పంచుల పదవి కాలం పూర్తవగానే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారులను గ్రామ పంచాయతీలకు కేటాయించింది కానీ ఇప్పుడు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారుల పనితీరు ప్రజలకు శాపంగా మారింది. ఏ గ్రామాల్లో చూసిన, ఏ వీధిలో చూసిన చెత్త కుప్పలు, తెప్పలుగా పెరుగుపోయి మురికి కాలువలు చెత్తచెదారం నిండాయి గ్రామాల్లో, వీధుల్లో ముక్కు మూసుకుని నడిచే దుస్థితి నెలకొంది.పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన పడకేసింది. ఒక్కో అధికారి పంచాయతీల బాధ్యతలను అప్పగించడం, వారు చుట్టపు చూపుగా గ్రామాలకు రావడంతో పంచాయతీల పాలన అస్తవ్యస్థంగా మారిపోయింది. మరమ్మతులకు నోచుకోకపోవడం, పారిశుధ్యంపై పర్యవేక్షణ కొరవడడంతో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు.

తెలంగాణలో సర్పంచ్ ల పాలన ముగియడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అయితే అధికారులు మాత్రం పారిశుద్ధ్య లోపం, అభివృద్ధి ని ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో పారిశుద్ధ్య లోపం తారస్థాయికి చేరుకుందని గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని ప్రజలు వాపోతున్నారు .ఈ ఏడాది జనవరి నెలాఖరునాటికి సర్పంచుల పదవీ కాలం ముగిసింది. దీంతో పంచాయతీల పాలనావ్యవహారా లను చూసేందుకు ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. ప్రత్యేకాధికారుల పాలన మొదలై 7 నెలలవు తోంది. నిధులు లేమికి తోడు తమకున్న శాఖారపరమైన విధులే కాకుండా గ్రామాల ప్రత్యేక అధికారుల అదనపు బాధ్యతలు అప్పగించడంతో సదరు అధికారులు పల్లెలను పెద్దగా పట్టించుకోవడం లేదు. నామమాత్రంగానే పల్లెల ముఖం చూడడం లేదు. దీంతో పంచాయతీల్లో పర్యవేక్షణ కొ రవడింది. ఫలితంగా స్థానికంగా పంచాయతీ కార్యదర్శు లపైనే మొత్తం భారం పడుతున్నది. అభివృద్ధి పనులు పడకే శాయి. మరమ్మతులు అటకెక్కాయి. ప్రత్యేకాధికారుల పాలన కు ముందు పంచాయతీ ఖాతాల్లోని నిధులను సర్పంచులు వాడేసుకున్నారు. ఇప్పుడు పంచాయతీల ఖాతాల్లో ఒక్క పైసా కూడా లేదు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి కొన్ని నెలలుగా నిధులు జమకావడం లేదు. దీంతో పంచాయతీల పాలన మొక్కుబడిగా సాగుతోం ది. పారిశుధ్య పనులు పూర్తి స్థాయిలో జరగడం లేదు. గతంలో చేపట్టిన పలు పనులకే నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండడటంతో కొత్త పనులు చేపట్టే పరిస్థితి ఎక్కడ లేకుండా పోయింది. ప్రస్తుత రానున్న వర్షాకాలంలో గ్రామాల్లో పారి శుధ్యం మెరుగుపడకపోతే ప్రజలు జబ్బుల బారిన పడే అవకాశం ఉంది. ఇప్పటికే గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. డెంగీ మలేరియా, టైఫాయిడ్ కేసులు పెద్దసంఖ్యలో నమోదవుతున్నాయి. పారిశుధ్య చర్యలు తీసుకోకపోతే పరిస్థితి చేయిదాటి పోయే ప్రమాదం ఉందని గ్రామీణులు ఆంధోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ లలో నిధుల లేక, పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వడంలో పూర్తి నిర్లక్ష్యం చేయడం వలన కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి వాళ్లు ప్రతి రోజు నిరసనలతో తమ బాధలను చెప్పుకుంటున్న ప్రభుత్వ మాత్రం పట్టించుకోకపోవడం బాధాకరం. గ్రామపంచాయతీ కార్యదర్శులు గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు చేసి నెట్టుకు రావడం గగనమైపోతుంది. లక్షలాది రూపాయలను అప్పులు చేసినా గ్రామాల అభివృద్ధికి తీవ్ర లోపం జరుగుతోంది.

అప్పులు చేసి గ్రామంలో తాగునీరు, వీధి దీపాల ఏర్పాటు, సరిపోతుందని, గత కొన్ని నెలలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో పలు గ్రామాలలో పారిశుధ్య కార్మికులు పనులను నిలిపివేయడంతో గ్రామాలు పారిశుద్ధంతో నిండిపోయాయి. ప్రత్యేక అధికారులు మాత్రం ఇలాగైనా గ్రామ కార్యదర్శి లే బాధ్యత వహిస్తూ, పనులను పూర్తి చేయాలని ఆదేశాలు ఇవ్వడం తో గ్రామ కార్యదర్శిల పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారైంది. పక్క మండలాల నుంచి కార్మికులను తీసుకువచ్చి పారిశుధ్య కార్మికులను చేపట్టడానికి ప్రయత్నిస్తున్న కార్యదర్శులకు పారిశుద్ధ కార్మికులు అడ్డుపడడంతో ఏమి చేయలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రతి గ్రామపంచాయతీకి ప్రత్యేక నిధులు కేటాయించి పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టిని సాధించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఆదర్శ పాఠశాలల కమిటీల పేరుతో పాఠశాలల మరమ్మత్తుల విషయంలో అధికారులు నిమగ్నం కాగా, పారిశుద్ధ లోపం స్పష్టంగా కనబడుతుంది. గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం, స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా, మండల అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# అటకెక్కిన ప్రభుత్వ హామీలు

- ఉద్యోగుల సమస్యల పరిష్కారించడంలో మీనమేషాలు
- ప్రభుత్వంపై ఉద్యోగుల్లో సన్నగిల్లుతున్న నమ్మకం
- జీపీఎఫ్, సరెండర్ బకాయిలు వెంటనే చెల్లించాలి
- పెండింగ్ డిఏలు, పీఆర్సీని తక్షణమే ప్రకటించాలి



**హిమాయత్ నగర్ (ప్రశ్న న్యూస్)** ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి శాంత్ కుమార్ అసహణం వ్యక్తం చేసారు. హిమాయత్ నగర్ లోని కా. సత్యనారాయణరెడ్డి భవన్ లో శుక్రవారం నాడు నిర్వహించిన తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅథితిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ఎలాంటి కదలికలేదని, దీంతో ప్రభుత్వంపై ఉద్యోగుల ఆశలు సన్నగిల్లుచున్నాయని అన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ వీరేష్ బాబు మాట్లాడుతు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ముఖ్యంగా పెండింగ్ లో ఉన్న డిఏలు పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేసారు. ఉద్యోగుల పెండింగ్ లో ఉన్న జీపిఎఫ్, సరెండర్ లీవ్ ఎన్ క్యాష్ మెంట్ తదితర బకాయలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేసారు. అలాగే జీఓ నెం. 317 వల్ల నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం జరగక ముందే సాధారణ బదిలీలపై నిషేదాన్ని ఎత్తివేస్తు ఉత్తర్వులు జారీచేయడం ఆక్షేపనీయమని దీంతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైందని విచారం వ్యక్తం చేసారు. ఇక తెలంగాణ వైద్య విధాన పరిషత్ లో జీఓ నం. 317 అలోకేషన్ పూర్తయి పదోన్నతుల ప్రక్రియ ప్రారంభ సమయంలో బదిలీల ఉత్తర్వులు రావడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొన్నదని అన్నారు. ఉద్యోగుల ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి త్వరలోనే వైద్య విధాన పరిషత్ ను రద్దుచేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ గా మార్చాలని అలాగే 010 పద్దు కింద జీతాలను మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు ఆరోగ్యమ్మ, సైదమ్మ, సుజాత అజీముద్దీన్,పలు ఆస్పత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## టూరిస్టులను ఆకర్షించే విధంగా

# నల్లమల అభివృద్ధి

### - పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



**అచ్చంపేట (ప్రశ్న న్యూస్) :** దేశంలోని టూరిస్టులను ఆకర్షించే విధంగా నల్లమల అడవులను అభివృద్ధి చేస్తామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నల్లమలలోని పర్యాటక ప్రాంతాలను గుర్తించేందుకు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, మంత్రి దామోదర్ రాజనర్సింహ తో కలిసి కృష్ణారావు ఇవాళ అచ్చంపేట నుంచి బయలుదేరారు. ముందుగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఉమామహేశ్వరం ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి మొదటి విడతగా రూ, 50 లక్షల నిధులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీశైలం వెళ్లే భక్తులు ఉమామహేశ్వరం వచ్చే విధంగా ప్రధాన రహదారిపై బోర్డులను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండు రోజులపాటు నల్లమలలో పర్యటించి పురాతన ఆలయాలతో పాటు టూరిజం పరంగా అభివృద్ధి చేసే ప్రాంతాలను పరిశీలిస్తామన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా మార్చడంతో పాటు ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అనంతరం రంగాపూర్ నిరంజన్ షావలి దర్గాను మంత్రులు, ఎమ్మెల్యేలు దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

# జేఎన్టీయూహెచ్‌లో

# ఇంచార్జ్ వీసీ ఆదేశాలు బేఖాతారు

### - కమిటీల పేరుతో విద్యార్థి నాయకులకు బెదిరింపులు

- భారీ స్థాయిలో అవినీతి అక్రమాలు జరిగాయని విద్యార్థుల ఆరోపణ
- పూర్తిస్థాయి విచారణ చేయించాలని విద్యార్థుల డిమాండ్





**కూకట్ పల్లి(ప్రశ్న న్యూస్)** నగరంలో గత వారం రోజులుగా జేఎన్టీహెచ్ క్యాంటీన్ టెండర్ విషయంలో జరిగిన అక్రమాలపై నిరంతరం ఉద్యమాలు, కంప్లైంట్లు క్యాంపస్ లో నడుస్తున్నాయి. ఈ మేరకు వాటి కారణంగా ఇన్చార్జి వీసీ క్యాంటీన్ టెండర్ ను సత్వరమే రద్దుచేసి కొత్త టెండర్లకు ఆదేశాలు జారీచేశారు. అయినప్పటికీ వ్యవస్థ లోపం కారణంగా క్యాంటీన్ కాంట్రాక్టర్ ఇన్చార్జి వీసీ ఆదేశాలను బేకాతారు చేసి పర్మిషన్ లేని స్టాల్స్ ను నడుపుతున్నాడని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. క్యాంపస్ లో ప్రశ్నించిన విద్యార్థులను, విద్యార్థి నాయకులను కమిటీల పేర్ల మీద భయపెట్టడమనేది సాధారణంగా మారింది. తప్పు చేసిన వారిపై కాకుండా తప్పుని ప్రశ్నించిన వారిపై కమిటీలు వేయడం ఏంటని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు క్యాంటీన్ లో జరిగిన అక్రమాలపై ఎంతో మంది ఎన్నో విజ్ఞప్తులు చేసినా పట్టించుకోకపోవడమనేది చాలా దారుణమైన విషయమని, ఇలాంటివి ఉదంచాలు తర్వాతి కాలంలో పునరావృతం కాకుండా చూసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. ఇప్పటికైనా క్యాంటీన్ అక్రమాలపై విజిలెన్స కమిటీ వేసి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. క్యాంటీన్ లో మినిమం ఫెసిలిటీస్ లేకుండా ఫైన్లు, కుర్చీలు, టేబుల్స్ అలాగే కిచెన్ లో ఎటువంటి శుభ్రత పాటించకుండా ఉండడం, ఇప్పుడు ఉన్న క్యాంటీన్ కాంటాక్ట్ ను వెంటనే పంపించేసి కొత్త కాంట్రాక్టర్ వచ్చే సమయం లోపు మినిమం ఫెసిలిటీస్ కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు. అలాగే ఈ పాత కాంటినెంట్ ఇండోర్



విషయంలో జేఎన్టీయు యూనివర్సిటీ కోల్పోయిన డబ్బులను తిరిగి శ్రీ శ్రీ క్యారెక్టర్స్ నుంచి వసూలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీనివల్ల యూనివర్సిటీ పేరు అలాగే స్టాండర్డ్స్ చాలా దిగజారిపోతున్నాయి. ఇలాగే కమిటీలు వేసి బెదిరించడం జరిగితే అది ఉద్యమ రూపం దాల్చి కార్యచరణ తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

# నగరంలో ఇక బోనాల సందడి

### - ఆదివారం గోల్కొండ బోనాలతో షురూ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** ఆషాఢ మాసం వచ్చిందంటే చాలు భాగ్యనగరంలో బోనాల సందడి మొదలవుతుంది. అమ్మ బైలెల్లినాదే అంటూ అమ్మవారికి భక్తులు చీర, సారెలు, నైవేద్యాలతో బోనాలు సమర్పిస్తుంటారు. ప్రతీ ఏడాది లాగే ఈ సారి కూడా హైదరాబాద్‌లో బోనాల జాతరకు సర్వం సిద్ధమైంది. గోల్కొండ జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పించడంతో బోనాల జాతర షురూ అవుతుంది. ఈనెల 7వ తేదీ ఆదివారం నుంచి గోల్కొండ ఖిల్లా నుంచి జాతర ప్రారంభంకానుంది. ఇప్పటికే బోనాల పండుగ కోసం పెద్ద ఎత్తున సర్కార్ ఏర్పాట్లు చేసింది. గోల్కొండ నుండే రాష్ట్రవ్యాప్తంగా బోనాల పండుగ మొదలవుతుంది. గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. రేపు ఒక్కరోజే సమయం ఉండడంతో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు? పూర్తి అయ్యాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అన్ని శాఖల సమీక్షతో భారీ ఏర్పాట్లు జరిగాయి. గోల్కొండ తర్వాత సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ మహాకాళి బోనాలను నిర్వహించడం జరుగుతుంది. ఆషాఢ మాసం చివరి రోజున తిరిగి గోల్కొండ కోటలో చివరి బోనంతో పూజలు చేసి ఉత్సవాలను ముగింపు పలుకుతారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588